PRGI NO.TELTEL/2010/33275

# ప్రజాకలం
తెలుగు దినపత్రిక

80th INDIA INDEPENDENCE DAY AUGUST 15

Digital Editions
http://prajakalam.in
epaper.prajakalam.in
paperboy.com, www.magzter.com

శనివారం | 15-08- 2026 | సంపుటి: 17, సంచిక: 134, నిజామాబాద్, పేజీలు : 12, వెల : 3/- | ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

ప్రజాకలం పాఠకులకు,
ప్రకటనదారులకు, అధికారులకు
రాజకీయనాయకులకు, కార్యకర్తలకు
సిబ్బందికి, మిత్రులకు, మా శ్రేయోభిలాషులకు

## స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు
- ప్రజాకలం టీం



## ఈ సారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో

# గ్లోబల్ సమ్మిట్ 2.0

మొదటి పేజీ తరువాయి...

**తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0**

గత ఏడాది నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు కొనసాగింపుగా ఈ ఏడాది కూడా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో సదస్సు నిర్వహించేందుకు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

**'ఇన్వెస్ట్ తెలంగాణ'తో పెట్టుబడులకు ఆహ్వానం**

ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' ప్రధాన థీమ్‌గా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భారత్ ఫ్యూచర్ సిటీ ప్రణాళికను ప్రపంచ వేదికపై ఆవిష్కరించనున్నారు. ముఖ్యంగా డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లో తెలంగాణకు ఉన్న విస్తృత అవకాశాలను అంతర్జాతీయ పెట్టుబడిదారులకు వివరించి, భారీ పెట్టుబడులను రాష్ట్రానికి ఆకర్షించేలా సదస్సును నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.

**సన్న ధాన్యం సాగుకు ప్రోత్సాహం**

వానాకాలం పంటలో సన్న ధాన్యం సాగును మరింత పెంచేందుకు రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇందుకోసం గుర్తించిన ఏడు రకాల సన్న ధాన్యం వంగడాల సాగును ప్రోత్సహించాలని తీర్మానించింది. రైతులకు అవసరమైన అవగాహన, మార్గదర్శకాలను అందించి సన్న ధాన్యం ఉత్పత్తిని పెంచేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.

**17.54 లక్షల టన్నుల మిగులు ధాన్యం ఈ-ఆక్షన్**

యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలిచిందని కేబినెట్ సమావేశం చర్చించింది. ఈసారి రికార్డు స్థాయిలో 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో 63.62 లక్షల మెట్రిక్ టన్నులను కేంద్ర ప్రభుత్వం సేకరించనుండగా, మిగిలిన 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ-ఆక్షన్ ద్వారా విక్రయించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇటీవల మొక్కజొన్న వేలం ద్వారా ఆదాయం సమకూరిన నేపథ్యంలో, మిగులు ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2,389 బేసిక్ ప్రైస్ నిర్ణయించి ఈ-ఆక్షన్ నిర్వహించనున్నారు.

**స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి ఐటీఐలు**

రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న ఈ విద్యా, నైపుణ్య శిక్షణ సంస్థలను ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేసే నిర్ణయం తీసుకుంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించి యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

**ఏడు నియోజకవర్గాల్లో రెసిడెన్షియల్ స్కూళ్లు**

ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతగా 113 నియోజకవర్గాల్లో స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించగా, ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు మంజూరయ్యాయి.

**ఆటోలకు ఈవీ బాట**

హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చే లక్ష్యంలో భాగంగా కాలుష్య నియంత్రణకు మరో కీలక నిర్ణయం తీసుకుంది. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ప్రస్తుతం ఉన్న 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు రూ. 200 కోట్లతో తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్ అమలు చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అర్హత కలిగిన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ. 1.50 లక్షల వరకు సబ్సిడీ అందించనున్నారు. ప్రస్తుత ఆటోకు విద్యుత్ కిట్ అమర్చుకోవడం లేదా పాత ఆటోను స్క్రాప్ చేసి కొత్త ఈవీ ఆటో కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించనున్నారు.

**హిల్ట్ దరఖాస్తు గడువు పొడిగింపు**

హైదరాబాద్ నగర పరిధిలోని కాలుష్యకారక పరిశ్రమలను నగర శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీ దరఖాస్తు గడువును మరో మూడు నెలలు పొడిగించింది. పరిశ్రమల యాజమాన్యాల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించింది. కాలుష్య నియంత్రణతో పాటు నగరంలో పర్యావరణ సమతుల్యతను మెరుగుపరచడం ఈ విధానం ప్రధాన లక్ష్యం.

**లక్ష ఎకరాలకు సాగునీరు**

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ఫేజ్-II పనులకు రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు, సంబంధిత ప్రాంతాలకు తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటిని అందించే అవకాశం ఏర్పడనుంది. ఈ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ఈ ఎత్తిపోతల పథకం కీలకంగా మారనుంది.

**గూడెందొడ్డి సామర్థ్యం పెంపు**

గూడెందొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనితో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలపై సమగ్ర అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించేందుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో భవిష్యత్ విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు పునరుత్పాదక ఇంధన వనరులను విస్తరించడంలో ఈ నిర్ణయం కీలకంగా నిలవనుంది. మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాతో మాట్లాడి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. సంక్షేమం, వ్యవసాయం, విద్య, ఉపాధి, పెట్టుబడులు, పర్యావరణ పరిరక్షణ, సాగునీరు, విద్యుత్ రంగాలకు సమాంతర ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర అభివృద్ధికి దోహదపడేలా మంత్రివర్గ నిర్ణయాలు ఉన్నాయని వారు వివరించారు.

# నాణ్యతలో రాజీ పడొద్దు

మొదటి పేజీ తరువాయి...

అనంతరం కేబినేట్ సబ్ కమిటీ ఛైర్మన్ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.వేయి కోట్లు కేటాయించిందన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే టైర్-1 ప్రాంతాలకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమైన ప్రాంతాల్లో... ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలా అని... నాణ్యతలో రాజీ పడొద్దని, పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సంబంధిత అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని స్పష్టం చేశారు. వర్క్ ప్రోగ్రెస్ ను రోజువారీగా తెలుసుకునేలా ప్రత్యేక డ్యాష్‌బోర్డును అందుబాటులోకి తేవాలని దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమష్టిగా పని చేస్తేనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పుష్కరాలు విజయవంతం అవుతాయన్నారు. శాఖల మధ్య సమన్వయం లోపం తలెత్తకుండా సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేకంగా చొరవ తీసుకో వాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి రోడ్డును అనుసంధానించాలన్నారు. ఎక్కడైనా రోడ్ల కనెక్టివిటీ మిస్ అయితే వెంటనే గుర్తించి, లోకల్ ఫండ్స్ నుంచి పనులు చేపట్టాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా ఉన్నతాధికారులు, పండితులను పుష్కర ఏర్పాట్లలో తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలన్నారు. భక్తులకు సేవలు అందించేందుకు ముందుకొచ్చే స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను ముందుగానే గుర్తించాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. కేబినేట్ సబ్ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుని... అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. పుష్కర ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# జలవిద్యుత్ సొరంగంలోకి భారీగా వరద

మొదటి పేజీ తరువాయి...

వల్ల సొరంగంలో సగం భాగం శిథిలాలు, నీటితో నిండిపోవడంతో కార్మికులు అందులో చిక్కుకుపోయారు. గురువారం నాడు ఈ ఘటన జరిగినప్పుడు సొరంగంలో 22 మంది ఉన్నారని జిల్లా విపత్తు నిర్వహణ అధికారి ఎన్.కె. జోషి తెలిపారు. వారిలో 19 మందిని రాత్రికి రాత్రే రక్షించగా, ఏడుగురు మరణించారని, గల్లంతైన ముగ్గురి కోసం గాలింపు కొనసాగుతోందని చెప్పారు. అధికారుల ప్రకటన ప్రకారం, మరణించిన వారిని తెహ్రీకి చెందిన ప్రదీప్ సింగ్ పవార్, చమోలీకి చెందిన ముఖేష్, బీహార్‌కు చెందిన దుర్లభ్ శర్మ, జార్ఖండ్‌కు చెందిన విజయ్, జితేంద్ర కుమార్, అలాగే లోకేశ్వర్, భునేశ్వర్‌లుగా గుర్తించారు. వీరిలో లోకేశ్వర్, భునేశ్వర్‌ల స్వస్థలం వివరాలు ఇంకా తెలియరాలేదు. గాయపడిన వారిని గోపేశ్వర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికీ నీటితో నిండి ఉన్న ఆ సొరంగంలోకి ఆరుగురు సహాయక సిబ్బంది ప్రవేశించారు. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్, పోలీసులు సహాయక చర్యలు చేపడుతున్నారు. సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి హెలికాప్టర్‌లో పిపల్‌కోటికి చేరుకున్నారు. ఘటనా స్థలంలో ఉన్న జిల్లా మేజిస్ట్రేట్ గౌరవ్ కుమార్, గల్లంతైన వారి ఆచూకీ కనుగొనడానికి అవసరమైన అన్ని వనరులను సమీకరించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

# సీఎం సభకు సంగారెడ్డి సర్వం సిద్ధం

మొదటి పేజీ తరువాయి..

సభ ఏర్పాట్లను డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. సీఎం బహిరంగ సభను లక్ష మంది తో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సభ విజయవంతం కోసం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామిలతో ప్రతిరోజూ సమీక్షిస్తున్నామని చెప్పారు. సంగారెడ్డి ఐబీ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ప్రధానమంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీల విగ్రహాలను ఆవిష్కరించనున్నారని తెలిపారు. సీఎం సభకు సంగారెడ్డి నియోజకవర్గం నుంచే సుమారు 50 వేల మంది హాజరవుతారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వం అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చిందని విమర్శించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టి రాష్ట్రవ్యాప్తంగా కోటి ఐదు లక్షల మందికి అందించనుందని తెలిపారు. సభకు వర్షం వచ్చినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జర్మన్ షెడ్లు ఏర్పాటు చేస్తున్నామని జగ్గారెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్, నాయకులు కిరణ్ గౌడ్, కూన సంతోష్, షఫీ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.



# మహనీయుల స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

మొదటి పేజీ తరువాయి...

విగ్రహాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. సామాజిక అసమానతలను పారద్రోలి, అనగారిన వర్గాలు ఆత్మగౌరవంతో బతకాలనే లక్ష్యంతో జీవితాంతం కృషి చేసిన మహానుభావులు పూలే దంపతులని ఆయన కొనియాడారు. వారి విగ్రహాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరించుకోవడం మనందరి అదృష్టమని పేర్కొన్నారు. ఈ విగ్రహాల ఆవిష్కరణ ద్వారా బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న స్పష్టమైన సందేశాన్నిహా ఇచ్చామన్నారు. పూలే ఆశయాలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా ఆచరణలో అమలు చేస్తున్న ఏకైక ప్రజా ప్రభుత్వం తమదేనని ఆయన ఉద్ఘాటించారు.

బీసీల రిజర్వేషన్ల అమలుకు శాస్త్రీయమైన గణాంకాలు అవసరమని గతంలో అనేకసార్లు న్యాయస్థానాలు చెప్పినప్పటికీ, గతంలో ఏ ప్రభుత్వమూ ఆ సాహసం చేయలేదన్నారు. కానీ, దేశంలో మరే రాష్ట్రం చేయని విధంగా తెలంగాణలో శాస్త్రీయంగా కుల గణన (సోషియో, ఎకనామిక్, పొలిటికల్ సర్వే) చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచామని గుర్తుచేశారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలో బలహీన వర్గాలు 56 శాతం ఉన్నారని తేల్చామని, ఈ శాస్త్రీయ గణాంకాల ఆధారంగానే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయబోతున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జ్యోతిరావు పూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను కేవలం 300 మందికే ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆ సంఖ్యను 700లకు పెంచినట్లుహా తెలిపారు. దశాబ్దాలుగా సంక్షేమ హాస్టళ్లకు పక్కా భవనాలు లేవని సభలో ఆర్. కృష్ణయ్య ప్రస్తావించిన అంశంపై ఆయన స్పందిస్తూ.. సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేవలం ఏడాది కాలంలోనే ఒక్కో భవనానికి రూ. 200 కోట్లు కేటాయించి, రాష్ట్రవ్యాప్తంగా 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పినట్లుగా.. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రెసిడెన్షియల్ స్కూళ్లలో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసుకునేది వారి మార్గంలో ప్రయాణించి, వారు చెప్పిన సిద్ధాంతాలను అమలు చేసేందుకు స్ఫూర్తి పొందడానికేనని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. ఆ మహానుభావుల స్ఫూర్తి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలనలో చాలా స్పష్టంగా కనిపిస్తోందని, వారి విగ్రహావిష్కరణలో పాలుపంచుకునే అవకాశం రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టరు?

మొదటి పేజీ తరువాయి..

కార్డుల ముద్రణ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు, ఎన్ని కోట్లు ఖర్చు చేస్తున్నారనే వివరాలను వెల్లడించాలన్నారు. అదేవిధంగా, రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, వారికి గౌరవ వేతనంచెల్లించాలని పేర్కొన్నారు. పెంచిన రేషన్ డీలర్ల కమిషన్‌ను వెంటనే ఇవ్వాలని, బియ్యంలో నూకలు ఎక్కువగా ఉన్నాయన్న ఫిర్యాదులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా రేషన్ కార్డుల ద్వారా తెలంగాణలోని పేదలకు మరిన్ని నిత్యావసర సరకులు అందించాలని సూచించారు. కర్ణాటక తరహాలో కందిపప్పు, నూనె, రాగులు, చక్కెర, గోధుమలు ఇవ్వాలని.. బియ్యం వద్దనుకునే వారికి ప్రత్యామ్నాయ ఆహార ధాన్యాలు అందించాలన్నారు. పేదల ఆహార భద్రతపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలని అన్నారు. అలాగే, రేషన్ కార్డుల పంపిణీని పునఃపరిశీలించాలని, మోదీ ఫొటోతో కొత్త కార్డులు ముద్రించాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

# ప్రజలను మోసం చేస్తున్న బీజేపీని గద్దెదించుదాం

## :సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసఫ్

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

సిపిఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా శుక్రవారం సిపిఐ ప్రచార యాత్ర షాపూర్ నగర్ బస్ స్టాప్ వద్ద ముగింపు సభ సిపిఐ కుత్బుల్లాపూర్ నమితి తరపున నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు ఎండి యూసఫ్ పాల్గొని మాట్లాడుతూ...బిజెపి అధికారంలోకి వచ్చాక కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ బ్రిటిష్ పాలనలో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను రద్దుచేసి కార్పొరేట్ పెట్టుబడిదారీ యాజమాన్యాలకు ఉపయోగపడే విధంగా కార్మిక నూతన లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని విమర్శించారు. కార్మికులు సమ్మెహక్కును ఉద్యోగ భద్రతను కనీస వేతనాల హక్కులను ప్రమాదవశాత్తు బీమా పొందే హక్కును సంఘాలను స్థాపించిన హక్కులను కోల్పోయిందని పైకి మంచిగా కనిపించిన లోపలి సారమంతా యాజమాన్యాలకు ఉపయోగపడే విధంగా బిజెపి నరేంద్ర మోడీ చేసి వ్యాపారస్తులకు తమ భక్తిని చాటాయని విమర్శించారు. అంతేకాకుండా నిత్యవసర వస్తువుల ధరలు తగ్గిస్తానని హామీ ఇచ్చి ధరలను తగ్గించకుండా ధరలను విపరీతంగా పెంచి ప్రజలను ఆర్థిక ఇబ్బందుల్లో నెట్టిన బిజెపి నరేంద్ర మోడీ శ్రీరాముడి పేరుతో హిందూ పేరుతో ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నించారని కానీ అయోధ్య రామాలయంలో జరిగిన దొంగతనాన్నీ చూసి ప్రజలు బిజెపి మరియు మోడీ యొక్క అసలు రూపాన్ని తెలుసుకున్నారని అందుకే నరేంద్ర మోడీ అమిత్ షా పార్లమెంట్కు రాకుండా ప్రజలకు భయపడి దూరంగా ఉన్నారని ఈ సంఘటనలను చూస్తే రానున్న రోజుల్లో బిజెపిని ప్రజలు ఊడగొట్టడం ఖాయమన్నారు.

ఈకార్యక్రమానికి మరో అతిథి జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ... బిజెపి నరేంద్ర మోడీ ఎన్నికల్లో వస్తున్న విజయాలను చూసి గర్వంతో తాము ఏమి చేసినా ప్రజలు తిరగబడరని నియంతృత్వ పోకడలకు పోయి అనేక ప్రజావ్యతిరేక విధానాలను అవలంబించడం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోయి అంతిమంగా బిజెపికి వ్యతిరేకంగా పోరాడడం ప్రారంభించారు. దీనికి నిదర్శనమే ఢిల్లీలో జరిగిన విద్యార్థి ఉద్యమం అన్నారు. విద్యార్థి ఉద్యమంతో దిగివచ్చిన బిజెపి నరేంద్ర మోడీ అయోధ్య రామాలయంలో జరిగిన దొంగతనాన్ని గురించి మాట్లాడట్లేదని ఇదే వారికి రాముని పైన దేవునిపైన హిందుత్వం పైన ఉన్న ప్రేమను చూపిస్తుందని విమర్శించారు. నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం విద్యార్థి యువజన కార్మిక వ్యతిరేక విధానాలతో పాటు దేవుని వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ఇదే వారి ఓటమికి నాంది ప్రజలు చైతన్యవంతులు అవుతున్నారని వచ్చే ఎన్నికల్లో బిజెపికి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధమయ్యారని దాన్ని సిపిఐ నాయకత్వం, కార్యకర్తలు గ్రహించి తమ ప్రచారాలను మరింతగా పెంచడానికి దేశవ్యాప్తంగా ఈ ప్రచార యాత్రలను ప్రారంభించిందన్నారు ఈప్రచార యాత్రలో దేశంలోని రాష్ట్రాలు జిల్లాల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి అధ్యక్షత వహించగా సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు, రాములు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ ప్రజానాట్యమండలి అధ్యక్షులు బాబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు నర్సింహారెడ్డి, శాఖ కార్యదర్శి బక్కరి మల్లేష్, సిపిఐ నాయకులు శ్రీనివాస్, మల్లేష్ మహేందర్, రమేష్, ప్రసాద్ నాయక్, భీమేష్, కనకయ్య, రమేష్, కిష్టయ్య, వీరయ్య, మజ్జి గౌరీ, పవన్ భీమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నాకు, విద్యార్థులకు మధ్య జోక్య

మొదటి పేజీ తరువాయి..

ఘటనపై విచారణ జరపాలని కూడా యూనివర్సిటీని కోరింది. ఈ నిర్ణయంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. చివరకు ఈ అంశం సుప్రీం కోర్టుకు చేరింది. ఈ పరిణా మాలపై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ సారథ్యంలోని ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. బీసీఐ జోక్యం ఎంతమాత్రం అవసరం లేదని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. విద్యార్థులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. ఇది విద్యార్థులకు, తనకు మధ్య ఉన్న అంశమని స్పష్టం చేశారు. బీసీఐకి ఈ అంశంలో ఎలాంటి నిమిత్తం లేదని అన్నారు. విద్యార్థులకు నిరసన తెలిపే హక్కు ఉందని కూడా స్పష్టం చేశారు. బీసీఐ అనవసరంగా జోక్యం చేసుకుందని కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, ఆ ఆదేశాలను ఉపసంహరించుకున్నామని బీసీఐ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తదుపరి విచారణను కోర్టు మరో రెండు వారాల పాటు వాయిదా వేసింది. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా చీఫ్ జస్టిస్‌ను ఆహ్వానించడంపై అభ్యంతరం చెబుతూ యూనివర్సిటీ అధికారులకు సుమారు 450 మంది లేఖ రాయడంతో వివాదం మొదలైంది. పేపర్ లీక్‌పై ఛలో సంసద్ కార్యక్రమంలో విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌లో సుప్రీం కోర్టు తీరును తప్పుబట్టిన విద్యార్థులు ఈ లేఖను రాశారు.

# గీత దాటితే సీఎంతో సహా అందరూ ఒకటే

మొదటి పేజీ తరువాయి..

బహిరంగంగా మాట్లాడకూడదని మహేశ్ గౌడ్ వెల్లడించారు. రాజగోపాల్ రెడ్డి ప్రజానాయకుడు, నాకు మంచి మిత్రుడు అని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీ గీత దాటితే సీఎం సహా ఎవరినైనా సహించేది లేదని సూచించారు. రాజగోపాల్ రెడ్డి గీత దాడి మాట్లాడకూడదు.. ఆయన అలా మాట్లాడడం సరికాదన్నారు. ఏం మాట్లాడినా అధిష్ఠానం దృష్టికి పోతుందని మహేశ్ గౌడ్ తెలిపారు. బిల్లుల విషయంలో ఒక క్రమపద్ధతిలో ముందుకెళ్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో గత ప్రభుత్వం మాదిరిగా తాము చేయలేదన్న మహేష్ గౌడ్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏఐసీసీ ఇన్‌చార్జ్ దృష్టికి తీసుకెళ్లి చర్యలపై చర్చిస్తానని వ్యాఖ్యానించారు. మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. తమిళనాడు రాజకీయాలు చేస్తామంటే కుదరదని తేల్చిచెప్పారు. తమిళనాడు వేరు, తెలంగాన వేరని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు.

**ఆ వ్యాఖ్యలపై కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి క్లారిటీ**

కాంగ్రెస్‌లో బయట నుంచి వచ్చిన నాయకుల పెత్తనం ఎక్కువైందని మాత్రమే తాను చెప్పానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిన్న చేసిన ఈ వ్యాఖ్యలపై మరోసారి మీడియాకు ఆయన క్లారిటీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు.



# "స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణ పోటీ" లో బచ్పన్ చిన్నారుల ప్రదర్శన

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) చింతల్, వెంకటేశ్వర నగర్ లో బచ్పన్ పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాల చైర్మన్ టివిఆర్ కోటిరెడ్డి అకాడమిక్ డైరెక్టర్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీ పూర్ణిమ ఆధ్వర్యంలో బచ్పన్ చిన్నారులకు స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణ పోటీలు నిర్వహించారు. ఈనేపథ్యంలో ప్రీ ప్రైమరీ విద్యార్థులు నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, లక్ష్మీ బాయి, రుద్రమదేవి తదితర వేషధారణలో వచ్చి ఈపోటీల్లో పాల్గొన్నారు. చిన్నారుల ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య సమర యోధులు వారు చేసిన సేవల గురించి పిల్లలకు అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యమని చైర్మన్ కోటిరెడ్డి మాట్లాడారు. ఇందులో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

PRGI NO.TELTEL/2010/33275

# ప్రజాకలం

తెలుగు దినపత్రిక

Digital Editions
http://prajakalam.in
epaper.prajakalam.in
paperboy.com, www.magzter.com

80th INDIA INDEPENDENCE DAY AUGUST 15


ప్రజాకలం పాఠకులకు, ప్రకటనదారులకు, అధికారులకు రాజకీయనాయకులకు, కార్యకర్తలకు సిబ్బందికి, మిత్రులకు, మా శ్రేయోభిలాషులకు

స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

- ప్రజాకలం టీం


శనివారం | 15-08- 2026 | సంపుటి: 17, సంచిక: 134, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆


### ఈ సారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో

# గ్లోబల్ సమ్మిట్ 2.0

## డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో భారీ సదస్సు : రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు

- నేటి నుంచి రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు
- 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు..
- ప్రజా ప్రభుత్వంలో 62 లక్షల మందికి కొత్తగా రేషన్ కార్డులు
- 7.54 లక్షల మెట్రిక్ టన్నుల మిగులు ధాన్యానికి క్వింటాల్‌కు
- రూ.2,389 బేసిక్ ధర..
- ఈ-ఆక్షన్ ద్వారా విక్రయం
- పెట్రోల్, డీజిల్ ఆటోలకు గుడ్‌బై..
- రూ.200 కోట్లతో ఈవీ కన్వర్షన్ స్కీమ్.. ఒక్కో ఆటోకు రూ.1.50 లక్షల వరకు సబ్సిడీ



హైదరాబాద్, ఆగస్టు 14 (ప్రజాకలం) :
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల శుభ సందర్భంగా తెలంగాణ ప్రజలకు మరిన్ని సంక్షేమ ఫలాలను అందించే దిశగా రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో పాటు వ్యవసాయం, విద్య, పారిశ్రామిక పెట్టుబడులు, పర్యావరణ పరిరక్షణ, విద్యుత్, సాగునీరు తదితర రంగాలకు సంబంధించిన పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది.

**3.42 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు**

ప్రజా ప్రభుత్వంలో కొత్తగా రేషన్ కార్డులు పొందిన కుటుంబాలతో కలిపి రాష్ట్రంలో ప్రస్తుతం 3 కోట్ల 42 లక్షల మంది రేషన్ లబ్ధిదారులు ఉన్నారని ప్రభుత్వం వెల్లడించింది. గతంలో రాష్ట్రంలో 2 కోట్ల 81 లక్షల మంది రేషన్ కార్డు లబ్ధిదారులు ఉండగా, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా రేషన్ కార్డులు జారీ చేసి మరో 62 లక్షల మందికి ప్రయోజనం కల్పించింది. ప్రస్తుతం ఉన్న లబ్ధిదారులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది.

తరువాయి 2వ పేజీలో...

### మహనీయుల స్ఫూర్తితోనే

## కాంగ్రెస్ ప్రభుత్వ పాలన

### పూలే దంపతుల ఆశయాల సాధనకు కంకణబద్ధులై పని చేస్తున్న ప్రజా ప్రభుత్వం

- దేశానికే ఆదర్శంగా తెలంగాణలో శాస్త్రీయంగా కులగణన
- రాష్ట్రంలో 56 శాతం మేర ఉన్న బడుగు, బలహీన వర్గాలు
- ఏడాదిలోనే 100 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది
- విద్యా, సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ పూలే ఆలోచనలను అమలు చేస్తున్నాం
- నెక్లెస్ రోడ్‌లో పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




హైదరాబాద్, ఆగస్టు 14 (ప్రజాకలం) :
బడుగు, బలహీన వర్గాల ఆత్మ గౌరవం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, పూలే దంపతుల ఆశయాల సాధనకు కంకణబద్ధులై పని చేస్తున్నామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల

తరువాయి 2వ పేజీలో...



### సీఎం సభకు సంగారెడ్డి

# సర్వం సిద్ధం

### సంగారెడ్డిలో ఏర్పాట్లను పరిశీలించిన జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి

- లక్షా మంది తో భారీ బహిరంగ సభ
- భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు.
- సంగారెడ్డి మొత్తం ఫ్లెక్సీల మయం.
- ఐబి గెస్ట్ హౌస్ ముందు మాజీ ప్రధానుల విగ్రహాలను ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి.

సంగారెడ్డి ప్రతినిధి
ఆగస్టు 14(ప్రజాకలం ప్రతినిధి);
సంగారెడ్డిలో శనివారం నేడు జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ ఏర్పాట్లు చేస్తున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

# నాణ్యతలో రాజీ పడొద్దు

## సెప్టెంబర్ మొదటివారంలో పనులు మొదలు కావాల్సిందే..

### ఆగస్టు చివరి నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాల్సిందే - ఏర్పాట్లలో శాఖల మధ్య సమన్వయం తప్పనిసరి 'గోదావరి పుష్కరాలు -2027' కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాలు



హైదరాబాద్, ఆగస్టు 14 (ప్రజాకలం) :
'గోదావరి పుష్కరాలు-2027' నిర్వహణను రాష్ట్ర ప్రభు త్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబర్ మొదటి వారంలో పనులను ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఆ మేరకు టెండర్ ప్రక్రియను ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డా. బీ. ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన 'గోదావరి పుష్కరాలు - 2027' కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భం గా...కమిటీ సభ్యులు శాఖలవారీగా సన్నద్ధత, ఏర్పాట్ల పురోగతిని ప్రత్యేకంగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

తరువాయి 2వ పేజీలో...



### జలవిద్యుత్ సొరంగంలోకి

## భారీగా వరద

### - ఏడుగురు మృతి

చమోలీ: ఉత్తరాఖండ్ రాష్ట్రం చమోలీ జిల్లాలోని ఒక జలవిద్యుత్ ప్రాజెక్ట్ వద్ద నిర్మాణంలో ఉన్న సొరంగంలోకి నీరు ఒక్కసారిగా దూసుకురావడంతో ఏడుగురు కార్మికులు మరణించారని అధికారులు శుక్రవారం తెలిపారు. గల్లంతైన ముగ్గురి కోసం ప్రస్తుతం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని వారు తెలిపారు. మాయాపూర్ వద్ద ఉన్న ఒక సొరంగంలో ఈ ఘటన జరిగింది. కొండచరియలు విరిగిపడటం, భూమి కుంగిపోవడం

తరువాయి 2వ పేజీలో...

### నాకు, విద్యార్థులకు మధ్య

# జోక్యం చేసుకోవద్దు

### చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా సూర్యకాంత్

ఢిల్లీ: నల్సార్ విశ్వవిద్యాలయ విద్యార్థులపై చర్యలకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సిద్ధమైనందుకు చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా సూర్యకాంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తనకూ, విద్యార్థులకు మధ్య జోక్యం చేసుకునేందుకు వారెవరని ప్రశ్నించారు. 2026 బ్యాచ్ విద్యార్థులను న్యాయవాదులుగా చేర్చుకోవద్దంటూ రాష్ట్ర కౌన్సిల్స్‌ను బీసీఐ ఆదేశించిన విషయం తెలిసిందే. యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐని ముఖ్యఅతిథిగా ఆహ్వానించడంపై విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయం తీసుకుంది.

తరువాయి 2వ పేజీలో...



### స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని మోదీ

# ఫొటో ఎందుకు పెట్టరు?

### - ఎంపీ రఘునందన్ రావు..

ఢిల్లీ: తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఫొటో కచ్చితంగా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆక్షేపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం ఇస్తున్నవేనని ఎంపీ పేర్కొన్నారు. ఒక్క కిలో బియ్యం ఇస్తూ కార్డుపై ముగ్గురు కాంగ్రెస్ నేతల ఫొటోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలతో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడాన్ని రఘునందన్ రావు ఆక్షేపించారు. మోదీ ఫొటో లేకపోవడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుల పంపిణీపై ప్రభుత్వం



స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా ఎన్ని ఇస్తున్నారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. రేషన్ కార్డుల ముద్రణ ఖర్చులు, టెండర్ల వివరాలు బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు.

తరువాయి 2వ పేజీలో...

### గీత దాటితే సీఎంతో సహా

# అందరూ ఒకటే

### రాజగోపాల్‌పై పీసీసీ చీఫ్ ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 14 (ప్రజాకలం) :
మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో సీఎం రేవంత్ రెడ్డితో సహా ఎవరికైనా ఒకటే గౌరవమని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. రాజగోపాల్ రెడ్డికి కూడా అదే గౌరవం ఇస్తున్నామని తెలిపారు. సమయం వచ్చినప్పుడు వాళ్లకి అవకాశాలు ఉంటాయని చెప్పారు. అధిష్ఠానం హామీ ఇచ్చింది.. ఆ స్థాయిలో వాళ్లు చూసుకుంటారని వెల్లడించారు. రాజగోపాల్ రెడ్డి ఆవేదన, ఆందోళన అర్థం చేసుకుంటామన్నారు. నాలుగు గోడల మధ్య పార్టీ ఫోరంలోని అంశాలు

తరువాయి 2వ పేజీలో...



ప్రజా కలం
శనివారం, ఆగస్టు 15, 2026

# డ్రగ్స్ ముప్పు నుంచి బయిటపడేదెలా..

తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ సమస్య ఇంతింతై వటుడింతై అన్నట్టుగా విస్తరిస్తోంది. మొదట్లో హైదరాబాద్ కు మాత్రమే పరిమితం అనుకున్న డ్రగ్స్ ఇప్పుడు.. ఎడాపెడా ఎక్కడపడితే అక్కడ పట్టుబడుతున్నాయి. చివరకు డ్రగ్స్ పెడ్లర్లలో డాక్టర్లు, టీచర్లు, విద్యార్థులు కూడా ఉండటం అందర్నీ అవాక్కయ్యేలా చేస్తోంది. అంతకుముందు పబ్బులు, క్లబ్బుల్లో మాత్రమే డ్రగ్స్ దందా జరుగుతోందనే భ్రమలో ఉన్న అధికారులకు.. ఇటీవలి కేసులు కళ్లు తెరిపిస్తున్నాయి. ఉదాహరణకు వీకెండ్‌లో డాక్టర్లంతా ఓ చోట కలుస్తుంటారు. అది పైకి సాధారణ గెట్‌టుగెదర్‌లాగే ఉంటుంది. కానీ పొరపాటున పోలీసులొస్తే.. వారంతా కంగారు పడతారు. పరారవటానికి ప్రయత్నిస్తారు. అలాంటి సందర్భాల్లో డాక్టర్ల దగ్గర డ్రగ్స్ దొరకటం చూసి పోలీసులు విస్తుపోతున్నారు. అదే సమయంలో స్కూలు బ్యాగ్‌లు, కాలేజీ క్యాంటీన్లలో డ్రగ్స్ పట్టుబడే కల్చర్ కూడా బాగా పెరిగిపోయింది. ఇప్పటికే చాలాసార్లు విద్యాసంస్థల యాజమాన్యాలకు పోలీసులు వార్నింగ్ ఇచ్చినా.. ప్రతి విద్యార్థిని 24 గంటలు తాము మాత్రం ఎలా గమనించగలమని అవి చేతులెత్తేశాయి. చివరకు క్యాంపస్‌లో డ్రగ్స్ దొరక్కుండా జాగ్రత్తపడుతున్నాయి. కానీ డ్రగ్స్ మత్తుకు అలవాటుపడ్డ విద్యార్థులు ఏదో మార్గంలో డ్రగ్స్ తీసుకుంటూనే ఉన్నారు. విద్యార్థుల సౌకర్యం కోసం.. డ్రగ్స్ చాక్లెట్లు, డ్రగ్స్ సిగరెట్లు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అధికారులు డ్రగ్స్‌కు ఓ తలుపు మూసేస్తే.. మరో నాలుగు తలుపులు తెరుచుకుంటున్నాయి. అందుకే టాస్క్ ఫోర్స్, ఈగల్ పేరుతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినా.. అనుకున్న స్థాయిలో డ్రగ్స్‌ను కట్టడి చేయడం సాధ్యం కావడం లేదు.విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన టీచర్లు..చేయాల్సిన పని వదిలిపెట్టి స్టూడెంట్స్ కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. కేరళలోని వడకరలో రెండ్రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన రవాణలో కేసులో ముగ్గురు టీచర్లతో సహా ఓ డెలివరీ బాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు.దర్యాప్తులో భాగంగా నిందితుల వాట్సాప్ మేసేజ్ లు, బ్యాంకు అకౌంట్ల ట్రాన్సాక్షన్లు పరిశీలించిన పోలీసులు..డ్రగ్స్ సరఫరా వెనుక కింగ్ పిన్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన టీచర్లు ఇలాంటి అక్రమాలకు పాల్పడటం, డబ్బు కోసం అడ్డదారులు తొక్కడం వారి వ్యక్తిగత జీవితాలనే కాదు.. యువత భవిష్యత్తును కూడా నాశనం చేస్తుంది డ్రగ్స్ కొనుగోలుకు కావాల్సిన డబ్బుకోసం వాటి విక్రయానికి సిద్ధపడుతున్నారు. దొంగతనాలు, దోపిడీలకూ తెగబడుతున్నారు. గంజాయి మత్తు తలకెక్కి రాత్రిళ్లు వీధుల్లో గొడవలకు దిగుతూ భయోత్పాతం సృష్టిస్తున్నారు. జీవితాలు అల్లకల్లోలమై ఆఖరికి ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. కాసుల యావతో జాతి భవితవ్యాన్ని చీకట్లోకి నెడుతున్న డ్రగ్స్ కింగ్ పిన్లకు త్వరగా శిక్షలు పడకపోతుండటం వల్లే డ్రగ్స్ వెల్లువకు అడ్డుకట్టవేయడం సాధ్యపడట్లేదు.ఎన్‌డీపీఎస్ చట్టం కింద 2022–24 మధ్య దేశవ్యాప్తంగా మూడు లక్షల కేసులు నమోదయ్యాయి. 3.75 లక్షల మంది అరెస్టయ్యారు. కానీ, 268 మందికే శిక్షలు పడ్డాయి. తనిఖీలు, నమూనాల జప్తు, తరలింపుల్లో లోపాలు, ఫోరెన్సిక్ పరీక్షల్లో ఆలస్యం వంటివి దుర్మార్గులకు వరమవుతున్నాయి. చాలా రాష్ట్రాల్లో ప్రత్యేక ఎన్‌డీపీఎస్ కోర్టులు లేకపోవడం వల్లా కేసుల మేటలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం సంబంధిత కేసులు నాలుగు లక్షల వరకు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ వీలైనంత త్వరగా కొలిక్కి రావాలంటే– అవసరానికి తగినట్లు అన్నిచోట్లా స్పెషల్ కోర్టులను ఏర్పాటుచేయాలి. డ్రగ్స్ కేసుల దర్యాప్తులో సిబ్బందికి తగిన శిక్షణ అందించాలి. మాదకమూకల పీచమణచడంలో అన్ని రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలి. అన్నింటికన్నా ముఖ్యంగా తల్లిదండ్రులు తమ బిడ్డలు ఏం చేస్తున్నారో కనిపెట్టుకుని ఉంటూ, వారి ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలి. ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి డ్రగ్స్ వల్ల తలెత్తే దుష్పరిణామాలపై విద్యార్థులకు అనునిత్యం అవగాహన కల్పిస్తూ, వారిని సరైన దారిలో నడిపించాలి. లేకపోతే భావి భారతం మనం ఊహించలేనంత ప్రమాదకరంగా మారుతుందని చెప్పటానికి సంకోచించాల్సిన పని లేదు.ఈ కారణంగానే ఐఐటీ , ఐఐఎంలతో సహా దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో పెరుగుతున్న డ్రగ్ కల్చర్ కు చెక్ పెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఐఐటీ, ఐఐఎంలతో ప్రారంభించి అన్ని ఉన్నత విద్యాసంస్థల్లోనూ విద్యార్థులకు అడ్మిషన్ల సమయంలోనే స్వచ్ఛంద డ్రగ్స్ టెస్టులు నిర్వహించబోతున్నారు. ఈ మేరకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ఆయా సంస్థల్లో అడ్మిషన్లు కోరే అభ్యర్థులు తమ అడ్మిషన్ పత్రాలతో పాటు యాంఫెటమైన్లు, కొకైన్, గంజాయి, బెంజోడయాజెపైన్లు, ఫెన్సైక్లిడిన్ వంటి మాదకద్రవ్యాల నిర్ధారణకు స్వచ్ఛందంగా యూరిన్ టెస్ట్ చేయించుకోవాలి. కేంద్ర విద్యా శాఖకు చెందిన ఉన్నత విద్యా విభాగం చేపట్టిన ఈ కార్యక్రమం, దేశంలో మాదకద్రవ్యాల సమస్యను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా చెప్తున్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మాదకద్రవ్యాల నియంత్రణ విజన్ డాక్యుమెంట్ 2026–29లో దీన్ని జత చేశారు. దీని ప్రకారం వచ్చే మూడేళ్లలో కేంద్ర నిధులతో నడిచే 170 ఉన్నత విద్యా సంస్థలలోని సుమారు 10 లక్షల మంది విద్యార్థులకు దశలవారీగా డ్రగ్స్ పరీక్షలు నిర్వహిస్తారు.2029 నాటికి 10 లక్షల మంది విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంపై పరీక్షలు నిర్వహించే మిషన్ ను ప్రధాని మోడీ ఆగస్టు 2న ప్రారంభించారు. దీనికి నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్‌గా పేరు పెట్టారు. ఢిల్లీ ఎయిమ్స్ లోని నేషనల్ డ్రగ్ డిపెండెన్స్ ట్రీట్‌మెంట్ సెంటర్ ఈ మేరకు కాలేజీలు, వర్సిటీల విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షల కోసం మార్గదర్శకాలు ఇచ్చింది. ఇందులో డ్రగ్స్ పరీక్ష పూర్తిగా స్వచ్ఛందంగా, గోప్యంగా ఉండాలని, పరీక్ష చేయించుకునే విద్యార్థులపై ఎటువంటి ప్రతికూల పరిణామాలకు దారితీయకూడదని, దీనిని కేవలం కౌన్సెలింగ్ ప్రయోజనాల కోసం మాత్రమే ఉంచాలని సూచించింది. ఈ డ్రగ్ పరీక్షల కార్యక్రమం మూడు దశల్లో అమలు చేస్తారు. మొదటి దశలో ఈ ఏడాది ఐఐటీలు, ఐఐఎంలు, ఒక సెంట్రల్ యూనివర్సిటీలో చేపడతారు. వచ్చే ఏడాది 32 ఎన్ఐటీలు, ఎనిమిది ఐఐఎస్ఆర్ లు, మూడు ఎస్పీఏలు, 25 ట్రిపుల్ ఐటీలు, కేంద్ర నిధులతో నడిచే నాలుగు జేఎన్టీయూల్లో చేపడతారు. ఆ తర్వాత 2028–29లో 46 సెంట్రల్ యూనివర్సిటీలు ,నాలుగు డీమ్డ్–టు–బి విశ్వవిద్యాలయాలకు వీటిని విస్తరిస్తారు. డ్రగ్స్ తాత్కాలిక ఉత్తేజాన్ని ఇవ్వొచ్చు కానీ?అవి జీవితం మొత్తాన్నీ నాశనం చేస్తాయని ప్రధాని మోడీ యువతను హెచ్చరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ఈ మేరకు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు.కాబట్టి ఎవరి పిల్లల గురించి వారే మొదట జాగ్రత్తలు తీసుకోవాలి. స్కూళ్లు, కాలేజీల నుంచి టైంకి ఇంటికొస్తున్నారా.. లేదా..? బ్యాగుల్లో ఏం తీసుకెళ్తున్నారు..? ఎలాంటి స్నేహితులతో తిరుగుతున్నారు..? లాంటి కనీస జాగ్రత్తలు పాటించటం అత్యవసరమని నిపుణులతో పాటు ప్రభుత్వాలు కూడా సూచిస్తున్నాయి. ఎందుకంటే ప్రతి ఇల్లు డ్రగ్స్ రహితం కావాలనే సంకల్పం తీసుకుంటే.. ఆటోమేటిగ్గా హైదరాబాద్, తెలుగు రాష్ట్రాలు కూడా డ్రగ్స్ రహితం కావడం పెద్ద కష్టం కాదు. చివరిగా దేశం కూడా డ్రగ్స్ నుంచి విముక్తం అవుతుంది.

# ఆగస్టు 31న నిజామాబాద్‌లో పాంచజన్య సంకల్ప సభ




మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 14 (ప్రజాకలం): తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో ఆగస్టు 31న నిజామాబాద్ జిల్లాలో నిర్వహించనున్న పాంచజన్య సంకల్ప సభకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి, కోరుట్ల ఇన్‌చార్జి డాక్టర్ రఘు, తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర నాయకులు నవీన్ చారి, పార్లమెంట్ ఇన్‌చార్జి అలీం భాయ్‌తో పాటు జిల్లా ముఖ్య నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ.. తెలంగాణ రక్షణ సేన పార్టీ ఏర్పాటు అనంతరం తొలిసారిగా తన సొంత జిల్లా నిజామాబాద్‌కు కల్వకుంట్ల కవిత రానున్న నేపథ్యంలో ఆమెకు ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాంచజన్య సంకల్ప సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు నవీన్ చారి మాట్లాడుతూ.. తెలంగాణ కోసం అనేక పోరాటాలు చేసిన కవిత తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్నారని అన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, మహిళలకు రిజర్వేషన్లు, బీసీలకు న్యాయమైన ప్రాతినిధ్యం, అణగారిన వర్గాల హక్కులు, ఉచిత విద్య, ఉచిత వైద్యం వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే సభ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పార్లమెంట్ ఇన్‌చార్జి అలీం భాయ్ మాట్లాడుతూ మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. ఆగస్టు 31న జరిగే సభకు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. పాంచజన్య సంకల్ప సభకు భారీ జనసమీకరణతో విజయవంతం చేస్తామని పార్టీ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు అజార్ భాయ్, చెట్లపల్లి సుఖేంధర్ గౌడ్, లింగంపల్లి సంజీవ్, అడ్డగట్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ నిధులతో మంచరామిలో అభివృద్ధి పనులు

## – రూ.10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



సుల్తానాబాద్,ఆగస్టు 14:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) మండలంలోని మంచరామి గ్రామం అభివృద్ధి దిశగా మరో అడుగు ముందుకు వేసింది.గ్రామంలోని వివిధ వీధుల్లో దెబ్బతిన్న రోడ్లకు మోక్షం కల్పిస్తూ, రూ.10 లక్షల ఎంపీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి.గ్రామంలోని రోడ్ల సమస్యను పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని సర్పంచ్ ఉప్పు లక్ష్మి చేసిన విజ్ఞప్తికి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సానుకూలంగా స్పందించి తన ప్రత్యేక నిధుల నుంచి ఈ మొత్తాన్ని మంజూరు చేశారు.ఈ పనుల ప్రారంభ విషయాన్ని సర్పంచ్ లక్ష్మి పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు దృష్టికి తీసుకువెళ్లగా,ఆయన హర్షం వ్యక్తం చేస్తూ గ్రామాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న సర్పంచ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.ఈ మేరకు గ్రామంలో కొత్త సీసీ రోడ్లు అందుబాటులోకి వస్తుండటంతో స్థానిక ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ,కృషి చేసిన ఎంపీకి,ఎమ్మెల్యేకి, సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# సమగ్ర శిక్షా అభియాన్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

## హెచ్‌ఎంలు,స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం

## ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఆగస్టు 17 వరకు గడువు – జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద




పెద్దపల్లి,ఆగస్టు14:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి): సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన ఉపాధ్యాయుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ మరియు స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు ఈ నియామక ప్రక్రియ చేపట్టినట్లు ఆమె వెల్లడించారు.ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తూ నిర్దేశిత విద్యార్హతలు,ఇతర నిబంధనలు కలిగిన ఆసక్తి గల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు,స్కూల్ అసిస్టెంట్లు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.హైదరాబాద్‌లోని సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయంలో కోఆర్డినేటర్లు,అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ పోస్టులతో పాటు..జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాలు, ఎక్స్–ఆఫీషియో జిల్లా ప్రాజెక్ట్ అధికారుల కార్యాలయాల్లో ఫారిన్ సర్వీస్ నిబంధనలు,షరతుల ప్రకారం నిర్దేశిత కాలానికి డిప్యూటేషన్‌పై నియామకం కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.అలాగే రాష్ట్ర,జిల్లా కార్యాలయాల్లో ఓ.డి.ప్రాతిపదికన అసిస్టెంట్ కోఆర్డినేటర్ పోస్టులు,జిల్లా విద్యాశాఖాధికారుల కార్యాలయాల పరిధిలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ పోస్టులను కూడా ఈ ప్రక్రియ ద్వారా భర్తీ చేయనున్నారు.ఈ ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణ ప్రక్రియ ఆగస్టు 8 నుంచి ప్రారంభం కాగా,దరఖాస్తుల సమర్పణకు ఆగస్టు17 చివరి తేదీగా నిర్ణయించారు.అర్హత ప్రమాణాలు, విద్యార్హతలు, మార్గదర్శకా లు మరియు పూర్తి వివరాల కోసం పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ www.schooledu.telangana.gov.in లో పరిశీలించాలని డి.ఇ.ఓ సూచించారు. అర్హత,ఆసక్తి గల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు,స్కూల్ అసిస్టెంట్లు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలి



## – జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,ఆగస్టు14:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జిల్లాలో ప్రజలకు ఎటువంటి తాగునీటి సమస్యలు తలెత్తకుండా తక్షణమే తగిన ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలో తాగునీటి సరఫరా మరియు క్షేత్రస్థాయి సమస్యలపై సంబంధిత అధికారులతో ఆయన సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ క్షేత్రస్థాయి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ప్రతి గ్రామం,ప్రతి వార్డులోనూ తాగునీటి సరఫరా తీరుతెన్నులను పరిశీలించాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే గుర్తించాలని సూచించారు. గ్రామాలు,వార్డుల వారీగా తాగునీటి సరఫరా పరిస్థితి,ఎదురవుతున్న ఇబ్బందులు,వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి స్థాయి నివేదికను వెంటనే సిద్ధం చేసి అందించాలని ఆదేశించారు.ప్రజలందరికీ సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు నిరంతరం అందేలా ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.సరఫరా అవుతున్న నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించాలని,నాణ్యతా లోపాలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను హెచ్చరించారు.సమస్య చిన్నదైనా క్షేత్రస్థాయిలోనే తక్షణ పరిష్కారం చూపేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.ప్రజలకు తాగునీటి విషయంలో ఏమాత్రం ఇబ్బందులు కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ గంగాధర శ్రీనివాస్,మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ పూర్ణచందర్,వివిధ విభాగాల ఏఈలు,సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# దళిత పూజారికి 'గోమాత ప్రేమికుల హైందవ సేవా సంస్థ' ఆర్థిక చేయూత



మెట్ పల్లి రూరల్,ఆగస్టు 14;(ప్రజా కలం):

వెల్లుల్ల గ్రామంలోని ప్రసిద్ధ అక్క కొండ నరసింహా స్వామి ఆలయ దళిత పూజారి గంగారంకు గోమాత ప్రేమికుల హైందవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఆలయంలో నిత్య ధూప, దీప, నైవేద్యాల నిర్వహణ నిమిత్తం సంస్థ ప్రతినిధులు ఆయనకు 6,000 నగదును ఆర్థిక తోడ్పాటుగా అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణతో పాటు ఆలయాల సంరక్షణ, పూజారుల సంక్షేమానికి తమ వంతు సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. తమ ఆలయ పూజారికి తోడ్పాటు అందించినందుకు గ్రామస్తులు సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆధునిక హంగులతో మోర్చరీ పునరుద్ధరణ

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష




పెద్దపల్లి,ఆగస్టు14:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా రామగుండం ప్రభుత్వ వైద్య కళాశాల ఫోరెన్సిక్ విభాగం ద్వారా ప్రజలకు,పోలీసు, న్యాయవ్యవస్థలకు నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.ప్రతి నెల సుమారు 30 పోస్టు మార్టంలు నిర్వహిస్తున్న ఈ విభాగంలో, అత్యవసర సమయాల్లో రాత్రి వేళల్లోనూ సేవలందించాలని సూచించారు.మోర్చరీని మరింత ఆధునీకరించేందుకు కొత్త డిసెక్షన్ టేబుళ్లు,మెరుగైన లైటింగ్‌తో పాటు మృతదేహాల భద్రత కోసం 4 కొత్త కోల్డ్ ఫ్రీజర్ బాక్సులను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ ఆధునిక సదుపాయాలతో మెడికో–లీగల్ సేవలు మరింత సమర్థవంతంగా,నిష్పక్షపాతంగా సాగుతాయని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# జెడ్పీ పాఠశాలలో 'ఋతుక్రమ శుభ్రత నిర్వహణ' కార్నర్ ప్రారంభం




మెట్ పల్లి రూరల్, ఆగస్టు 14;(ప్రజా కలం): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన "ఋతుక్రమ శుభ్రత నిర్వహణ కార్నర్, ఇన్సినరేటర్ (ప్యాడ్ల నిర్మూలన యంత్రం) లను ఎంఈఓ కొండ కనకతార, గ్రామ సర్పంచ్ గూడూరు తిరుపతి, వైద్యాధికారి అంజిత్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలసరి సమయంలో బాలికలు బడికి గైర్హాజరు కాకుండా ఉండేందుకు ఈ కార్నర్ ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి చొరవతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్స్ అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మి, గ్రామ పాలనాధికారులు నాగరాణి, రాజేశం, ఏఎన్ఎం సువర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం

## చర్ల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా శంఖారావం : డా. మద్దిశెట్టి సామేలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:ఆగస్టు 14:(ప్రజా కలం న్యూస్):

గ్రామీణ ప్రాంతాలలో ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసేందుకు ఎన్‌సీపీ ఎన్వైసీ పార్టీ "ప్రజల దగ్గరికే పార్టీ" అనే నినాదంతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బైక్ ర్యాలీల ద్వారా ప్రతి గ్రామంలోని సమస్యలను తెలుసుకునేందుకు ఈ పర్యటనను ప్రారంభించినట్లు ఎన్‌సీపీ ఎన్వైసీ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డా. మద్దిశెట్టి సామేలు తెలిపారు.ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం నుంచి ఈ యాత్రను అధికారికంగా ప్రారంభించారు.చర్ల మండల కేంద్రంలో దాదాపు 30 మోటార్‌సైకిళ్లతో ఎన్‌సీపీ ఎన్వైసీ పార్టీ కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి పార్టీ జెండాలు, నినాదాలతో గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాలు, కరెంట్, రేషన్ కార్డు సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. "అధికారుల చుట్టూ నెలల తరబడి తిరుగుతున్నా పని కావడం లేదు" అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం చర్ల మండల ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లిన ఎన్‌సీపీ ఎన్వైసీ నాయకులు వినతిపత్రం అందజేసి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చర్ల మండల అధ్యక్షులు గొంది సుందర్రావు,పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ కారం చంద్రయ్య, ఎన్‌సీపీ ఎన్వైసీ జిల్లా అధ్యక్షులు ఊకే ఎంకన్న,పలువురు మండల, గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## ఘనంగా యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి జన్మదిన వేడుకలు

### ప్రభుత్వ హాస్పిటల్లో పండ్లు బ్రెడ్ పంపిణీ

గజ్వేల్:14 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని శుక్రవారం గజ్వేల్ ప్రభుత్వ ధావాఖానాలో వర్గల్ మండలం మాదారం ఉప సర్పంచ్ సాయికుమార్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేసి,అనిల్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనిల్ రెడ్డి యువతకు ఆదర్శమని వారికి మంచి రాజకీయ భవిష్యత్తు ఉన్నదని వారు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నందకుమార్,ప్రశాంత్,స్వామి, ప్రభుదాస్,నితిన్ రెడ్డి,శ్రీధర్,తదితరులు పాల్గొన్నారు

## వలిగొండలో వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు

### - 10 ద్విచక్ర వాహనాలు సీజ్

వలిగొండ ఆగస్టు 14 ప్రజాకలం:వలిగొండ మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తా వద్ద శుక్రవారం ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో



పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు.ముఖ్యంగా ఆర్సీలు,లైసెన్స్,నంబర్ ప్లేట్లు లేని వాహనాలు,నంబర్లు ప్లేట్లు సరిగా లేని వాహనాలపై దృష్టి సారించారు.తనిఖీల్లో 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు..ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా తనిఖీలు నిర్వహించామని,వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు.మైనర్లకు వాహనాలను తల్లిదండ్రులు ఇవ్వవద్దని,అలాగే సరైన పత్రాలు లేని వాహనాలను, నంబర్ ప్లేట్లు లేకుండా రోడ్డుపై నడిపిస్తే సీజ్ చేస్తామని తెలిపారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నియమాలు పాటించి,హెల్మెట్ వాడాలని, వాహనదారులకు సూచించారు.

## SIR-2026 కార్యక్రమంలో BLAలు, సీనియర్ నాయకులకు ఘన సన్మానం

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) AICC అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సూచనల మేరకు శుక్రవారం బహదూర్‌పల్లి పరిధి మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్‌లో SIR-2026 కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో దుండిగల్, బౌరంపేట్, బహదూర్‌పల్లి డివిజన్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ దీూాలు, సీనియర్ నాయకులు డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఏ.పీ. మిథున్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ కొలన్ హన్మంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, మాజీ ఫ్రజజ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, స్టేట్ ప్రోటోకాల్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, DCC కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈసందర్భంగా SIR-2026 కార్యక్రమంలో అంకితభావంతో పనిచేసిన దీూాలు, సీనియర్ నాయకులు డివిజన్ అధ్యక్షులను ఘనంగా సన్మానించి వారి సేవలను అభినందించారు. నాయకులు మాట్లాడుతూ.... SIR-2026 కార్యక్రమంలో బూత్ స్థాయిలో దీూాలు, నాయకులు కార్యకర్తలు చేసిన కృషి అభినందనీయమన్నారు. ఓటర్ల వివరాల పరిశీలన, అర్హులైన ఓటర్లకు సంబంధించిన ప్రక్రియలో బాధ్యతాయుతంగా పనిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. అదేవిధంగా రానున్న రోజుల్లో ఇదే నిబద్ధత, సమన్వయం అంకితభావంతో పనిచేస్తూ, అర్హులైన కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి కార్యకర్తలు, దీూాలు, డివిజన్ నాయకులు, సీనియర్ నాయకుల సమన్వయంతో ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా సమష్టిగా ముందుకు సాగాలని సూచించారు.



## మండలంలో సిఎస్ఆర్ నిధులతో సీసీ కెమెరాలు, వీధి దీపాలు, నూతన మహిళ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య




బొమ్మలరామారం ,ఆగస్టు 14 (ప్రజా కలం)

గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజల భద్రత,మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు యాదాద్రి భువనగిరి జిల్లా,బొమ్మలరామారం మండలం, రామలింగంపల్లి గ్రామంలో శుక్రవారం రోజున ఆప్టిమస్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (షేక్ మేట్) సౌజన్యంతో వచ్చిన (CSR) నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను,గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,ఆప్టిమస్ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ఆర్ నాగుల దేవేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చని అన్నారు గ్రామంలో ఎక్కడైనా అనుమానాస్పద ఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ద్వారా వివరాలను గుర్తించడం, బాధ్యులను గుర్తించడంలో పోలీసులకు ఎంతో సహాయపడుతుందని తెలిపారు ప్రజలు కూడా మరింత భద్రతా భావంతో ఉండేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు అదేవిధంగా మహిళా సంఘం భవనం గ్రామంలోని మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు మహిళా సంఘాల సమావేశాలు, స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలు,మహిళల ఆర్థిక సాధికారతకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఈ భవనం ఉపయోగపడుతుందని అన్నారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగుతూ స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బీర్ల అయిలయ్య సూచించారు గ్రామాల్లో మహిళల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజల భద్రత,మహిళల సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని,అందులో భాగంగానే వివిధ నిధులతో అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రామలింగంపల్లి గ్రామ సర్పంచ్ సుంచు యాదగిరి, ఉపసర్పంచ్ ఎర్వ ఉజ్వల హేమంత్ రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ సింగిర్తి మల్లేశం,మండల పార్టీ అధ్యక్షులు చీర సత్యనారాయణ,ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాలా చైతన్య మహేందర్ రెడ్డి,భువనగిరి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలెట్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు యాంజాల కళ,శ్రీరాములు నాయక్,రామిడి జంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎర్వ హేమంత్ రెడ్డి,సింగిరెడ్డి జితేందర్ రెడ్డి,బ్లాక్ అధ్యక్షురాలు పకీర్ సంగీత,గ్రామ వార్డ్ మెంబర్లు, గ్రామ పెద్దలు మహిళలు తదితరులు పాల్గొన్నారు



# ప్రతి పౌరుని గుండెలో దేశభక్తి నింపడమే లక్ష్యం

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్ –ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



పెద్దపల్లి,ఆగస్టు14:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి.హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ద్వారా ప్రతి పౌరుడి గుండెల్లో దేశభక్తిని నింపడమే మా లక్ష్యం అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్ పిలుపునిచ్చారు.దేశంలోని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలనే లక్ష్యంతో జూలపల్లి మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు అమరగాని ప్రదీప్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మండల కేంద్రంలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు 200 మీటర్ల భారీ జాతీయ జెండాను చేతబట్టి ప్రధాన పురవీధుల గుండా ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు.విద్యార్థుల దేశభక్తి నినాదాలతో పురవీధులు మార్మోగాయి.ర్యాలీ అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన సమావేశంలో ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు.హర్ ఘర్ తిరంగా అనేది కేవలం జెండా ఎగురవేయడం మాత్రమే కాదని,ప్రతి పౌరుడి గుండెల్లో జాతీయ భావాలను నింపే గొప్ప కార్యక్రమని కొనియాడారు.నేషనల్ యూత్ ప్రాజెక్ట్ రాష్ట్ర కన్వీనర్ కే.యాదవరాజు మాట్లాడుతూ కుల,మతాలకు అతీతంగా జాతీయ సమైక్యత కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.హర్ ఘర్ తిరంగా యాత్ర మండల కన్వీనర్ నాగుల అన్వేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కొప్పుల మహేష్,ఉపసర్పంచ్ దావు సంపత్ రెడ్డి,నాయకులు ఎర్రోళ్ల రాములు,కంకణాల జ్యోతిబసు,కొల్లూరి స్వామి,మల్లెత్తుల అంజి యాదవ్,నగునూరి సురేష్,పార్టీ కార్యకర్తలు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం

## - జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్



పెద్దపల్లి,ఆగస్టు 14:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ఆయిల్‌పామ్ సాగుతో రైతులు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం పొందవచ్చని,సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా ఈ సాగు వైపు మళ్లాలని జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు.శుక్రవారం మండలంలోని ఆయిల్‌పామ్ తోటలను సందర్శించిన ఆయన రెండో మరియు మూడో సంవత్సరం ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు.రైతులతో మాట్లాడి తోటల నిర్వహణ,ఎరువుల వినియోగం,నీటి యాజమాన్యం తదితర అంశాలపై సాంకేతిక సూచనలు అందించారు.ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ తోటల్లో సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా రాబోయే సంవత్సరాల్లో మరింత మెరుగైన దిగుబడులు,అధిక ఆదాయం పొందవచ్చని రైతులకు సూచించారు.ఆయిల్‌పామ్ సాగు ద్వారా లభిస్తున్న మంచి ఆదాయంతో రైతులు వరి మరియు ఇతర సంప్రదాయ పంటల నుంచి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగు వైపు మళ్లుతున్నారని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్‌పామ్ రైతులకు మొక్కలపై సబ్సిడీ,నాలుగు సంవత్సరాల నిర్వహణకు ఆర్థిక సహాయం,డ్రిప్ ఇరిగేషన్‌కు సబ్సిడీ అందిస్తూ పంటల వైవిధ్యీకరణకు ప్రోత్సాహం అందిస్తోందని వివరించారు.ఈ ప్రభుత్వ సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రస్తుత వాతావరణ మార్పులు,అనిశ్చిత వర్షపాతం వంటి పరిస్థితులను తట్టుకుని దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించగల పంటగా ఆయిల్‌పామ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు.భవిష్యత్తులో ఆయిల్‌పామ్‌కు మంచి మార్కెట్ అవకాశాలు ఉన్నాయని,ఇతర పంటల మాదిరిగా మార్కెట్ గ్లట్ సమస్య తలెత్తే అవకాశం తక్కువగా ఉంటుందని తెలిపారు.ప్రకృతి వైపరీత్యాలు,కోతులు,అడవి పందుల బెడద,దొంగతనాలు,మధ్యవర్తుల సమస్యలు వంటి అనేక ఇబ్బందులను అధిగమించేందుకు ఆయిల్‌పామ్ సాగు రైతులకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు.ఆయిల్‌పామ్ సాగులో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు,మార్కెట్ అవకాశాలు,దీర్ఘకాలిక ఆదాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జిల్లాలోని రైతులందరూ ఎటువంటి సందేహాలు,సంకోచాలు లేకుండా ఆయిల్‌పామ్ సాగును చేపట్టి పంటల వైవిధ్యీకరణలో భాగస్వాములు కావాలని కోరారు.రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలను ఉద్యానవన శాఖ అధికారులు నిరంతరం అందిస్తూ,ఆయిల్‌పామ్ సాగులో రైతులకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హెచ్ ఈ ఓ రాముతో పాటు ఆయిల్‌పామ్ రైతులు పాల్గొన్నారు.

# స్పష్టమైన లక్ష్యంతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

## - గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్

## - అంబరాన్ని అంటిన గాయత్రి కళాశాల విద్యార్థుల స్వాగతోత్సవ వేడుకలు




పెద్దపల్లి,ఆగస్టు 14:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని,అదే దిశగా నిరంతరం కృషి చేస్తూ ఉత్తమ ఫలితాలతో తల్లిదండ్రులకు,కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పట్టణ మున్సిపల్ పరిధిలోని రంగంపల్లి గోల్డెన్ తులిప్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం గాయత్రి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నూతన విద్యార్థుల స్వాగతోత్సవ వేడుక లు అత్యంత వైభవంగా,ఉత్సాహభరితంగా నిర్వహించారు. కళాశాలలోకి అడుగుపెట్టిన ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసిన ఈ వేడుక విద్యార్థి లోకంలో నూతన జోష్‌ను నింపింది.ఈ కార్యక్రమానికి గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి,జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులు,అధ్యాపకులు,తల్లిదండ్రులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా క్రమశిక్షణ,నైతిక విలువలు కూడా విద్యార్థికి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చిపెడతాయని పేర్కొన్నారు.ఆ లక్ష్య సాధన కోసం ఏకాగ్రతతో నిరంతరం శ్రమించాలని, మార్గమధ్యంలో ఎదురయ్యే చిన్నచిన్న ఆటంకాలను అధిగమిస్తూ ముందుకు సాగాలని సూచించారు.స్వాగతోత్సవ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి.నృత్యాలు,పాటలు,లఘు నాటికలతో ఫంక్షన్ హాల్ మొత్తం కళకళలాడింది.సీనియర్ విద్యార్థులు తమ జూనియర్‌లకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన వివిధ ఆటపాటల పోటీలు కార్యక్రమానికి మరింత వన్నె తెచ్చాయి.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్,అధ్యాపక బృందం,విద్యార్థుల తల్లిదండ్రులు,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మధిర అభివృద్ధి పనులు నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలి

## - పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు ఆదేశం

## - మధిర పట్టణంలో చేపట్టిన యూజీడీ, వైరా చెరువు పై రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

ఖమ్మం/ మధిర, ఆగస్టు -14( ప్రజా కలం న్యూస్)

మధిర పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధిర పట్టణంలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులు, వైరా చెరువుపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, నిర్మాణ పురోగతి, పనుల వేగం, ఉపయోగిస్తున్న నిర్మాణ సామగ్రి నాణ్యత తదితర అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంజూరు చేసిన పనులు లక్ష్యాలకు అనుగుణంగా కొనసాగాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, మధిర పట్టణ అభివృద్ధిలో భాగంగా యూజీడీ పనులు పూర్తయితే పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితులు మరింత మెరుగుపడటంతో పాటు, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా పనులను దశలవారీగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. యూజీడీ పనుల సందర్భంగా రహదారులు, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, పనులు పూర్తయిన వెంటనే రోడ్ల పునరుద్ధరణను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టి, ప్రజలకు ముందస్తు సమాచారం అందించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా మధిరలో వైరా చెరువుపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయితే చెరువు పరివాహక ప్రాంతంలో వరదలు, నీటి ప్రవాహం కారణంగా ఏర్పడే ముప్పును తగ్గించడంతో పాటు ప్రజలు, ఆస్తులకు రక్షణ కల్పించేందుకు దోహదపడుతుందని తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణంలో ఇంజినీరింగ్ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, నిర్మాణ నాణ్యత విషయంలో ఎట్టి



పరిస్థితుల్లోనూ రాజీపడరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్మాణానికి వినియోగించే సిమెంట్, ఇసుక, కంకర, ఇనుము తదితర సామగ్రి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించాలని, ప్రతి దశలో ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. పనుల్లో ఎక్కడైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించి పనులకు ఆటంకం కలగకుండా చూడాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మధిర పట్టణంలో చేపడుతున్న అన్ని అభివృద్ధి పనులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంతో పాటు, ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు అందించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట మధిర తహసీల్దారు రాంబాబు, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అధికారులపై నిరాధార ఆరోపణలు చేస్తే ఉపేక్షించం

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష - బొబ్బిలి సత్యనారాయణకు లోకాయుక్త రూ.10 వేల జరిమానా

పెద్దపల్లి,ఆగస్టు14:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

అధికారులపై నిరాధార ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు.




సామాజిక కార్యకర్తగా చెప్పుకునే పెద్దపల్లి మండలం రాఘవపూర్ కు చెందిన బొబ్బిలి సత్యనారాయణ అధికారులను అనవసరంగా అప్రతిష్ఠపాలు చేసే విధంగా లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.రాఘవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఏల్లమ్మ ఆలయ నిర్మాణానికి సరైన అనుమతులు లేవంటూ బొబ్బిలి సత్యనారాయణ జనవరి 2-2023న లోకాయుక్త కు ఫిర్యాదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ ఫిర్యాదుపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపి,అవసరమైన వివరాలతో కూడిన నివేదికను లోకాయుక్తకు సమర్పించినట్లు పేర్కొన్నారు.అధికారులు సమర్పించిన నివేదికను పరిశీలించిన అనంతరం,బొబ్బిలి సత్యనారాయణ దాఖలు చేసిన ఫిర్యాదు నిరాధారమైనది,వేధింపులకు ఉద్దేశించినదిగా లోకాయుక్త పేర్కొంటూ డిసెంబర్ 22-2025న ఫిర్యాదును కొట్టివేసిందని కలెక్టర్ తెలిపారు.తప్పుడు, నిరాధార ఫిర్యాదు ద్వారా లోకాయుక్త సంస్థ సమయంతో పాటు ప్రభుత్వ అధికారుల విలువైన సమయాన్ని కూడా వృథా చేసినందుకు రూ,10వేల జరిమానా విధించినట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. లోకాయుక్త ఆదేశాల మేరకు రూ.వేల జరిమానాను బొబ్బిలి సత్యనారాయణ నుంచి వసూలు చేసి ముఖ్యమంత్రి సహాయనిధిలో జమ చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు.ప్రజా సమస్యలపై వాస్తవాధారాలతో ఫిర్యాదులు చేయడాన్ని ప్రభుత్వం స్వాగతిస్తుందని,అయితే వ్యక్తిగత ప్రయోజనాల కోసం లేదా ప్రభుత్వ అధికారులను అప్రతిష్ఠపాలు చేయాలనే ఉద్దేశంతో నిరాధార ఆరోపణలు చేయడం,తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం సరికాదని జిల్లా కలెక్టర్ అన్నారు.అధికారులపై తప్పుడు వార్తలు,నిరాధార ఆరోపణలు వ్యాప్తి చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ఎవరినీ ఉపేక్షించబోమని,అలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# ఖమ్మం జిల్లాను పర్యాటకంగా తీర్చిదిద్దాలి

## - నీటి వనరులను పరిరక్షిస్తూ పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలి

## - జిల్లాలోని అత్యుత్తమ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు - ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలి

## - కలకోట పెద్ద చెరువు, మడుపల్లి, మధిర ట్యాంక్ బండ్ పర్యాటక అభివృద్ధి పురోగతి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం/బోనకల్, ఆగస్టు- 14( ప్రజా కలం న్యూస్)

ఖమ్మం జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులు, చెరువులు, సరస్సులను పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసి, జిల్లాను రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. బోనకల్, మధిర మండలాల్లో జిల్లా కలెక్టర్ పర్యటించి వివిధ పర్యాటక అభివృద్ధి ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బోనకల్ మండలంలోని కలకోట పెద్దచెరువు వద్ద పర్యాటక అభివృద్ధికి మంజూరైన పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి ప్రతిపాదనలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

అనంతరం మధిర మండలంలోని మడుపల్లి, మధిర ట్యాంక్ బండ్ ప్రాంతాలను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సందర్శించి, అక్కడ జరుగుతున్న పర్యాటక అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్ బ్లాక్ తదితర నిర్మాణ పనులను పరిశీలించి, నిర్మాణంలో ఉపయోగిస్తున్న సామగ్రి నాణ్యతను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యతలో ఎలాంటి లోపాలు తలెత్తినా సహించేది లేదని స్పష్టం చేశారు. మధిర రివర్‌ఫ్రంట్ అభివృద్ధి పనులను ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా అభివృద్ధి పనులను రూపొందించాలన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టే ప్రతి పర్యాటక అభివృద్ధి కార్యక్రమం సహజ వనరుల పరిరక్షణకు అనుగుణంగా ఉండాలని అన్నారు. పర్యాటక అభివృద్ధి పేరుతో నీటి వనరులు, పర్యావరణానికి ఎలాంటి నష్టం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లాలో పర్యాటక రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. మధిర ట్యాంక్ బండ్ పర్యాటక అభివృద్ధిలో భాగంగా G+1 తరహాలో రెండు కాటేజీలు, రిసెప్షన్, కిచెన్-రెస్టారెంట్, విద్యుదీకరణ, టాయిలెట్ బ్లాక్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు చేపట్టిన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ప్రర్యాటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా కలకోట పెద్దచెరువు బండ్ విస్తరణ, పర్యాటక అభివృద్ధి కోసం G+1 తరహాలో మూడు కాటేజీలు, రిసెప్షన్, కేఫెటీరియా, పార్కింగ్, విద్యుదీకరణ, టాయిలెట్ బ్లాక్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన అందించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు అవసరమైన భూమి అందుబాటులో లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఇంజినీరింగ్ పరిష్కారాలను అన్వేషించాలని కలెక్టర్ సూచించారు. అవసరమైతే పర్యాటక అభివృద్ధి కార్యక్రమాల కోసం భూసేకరణ చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.

అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పర్యాటక అభివృద్ధి ప్రతిపాదనలను త్వరితగతిన ఖరారు చేసి అమలు దశకు తీసుకురావాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, పార్కింగ్, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, భద్రత వంటి మౌలిక సదుపాయాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లాలోని సహజసిద్ధమైన నీటి వనరులను పర్యావరణ పరిరక్షణతో పాటు పర్యాటక అభివృద్ధికి అనుసంధానం చేస్తూ, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరిగేలా, చిన్న వ్యాపారాలు అభివృద్ధి చెందేలా, స్థానిక ఆర్థికాభివృద్ధికి దోహదపడే విధంగా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా టూరిజం అధికారి బి. సుమన్ చక్రవర్తి, మధిర తహసీల్దారు రాంబాబు, బోనకల్ తహసీల్దారు, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెన్షన్ ధ్రువీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలి

## తహశీల్దార్‌కు బీఆర్ఎస్ నేతల వినతి

మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 14 (ప్రజాకలం) రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్న అర్హులైన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతూ మెట్‌పల్లి పట్టణ బీఆర్ఎస్ పార్టీ నాయకులు తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఈ వినతి కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు.పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియలో అవసరమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన జారీ చేయాలని వారు కోరారు. ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం కారణంగా వృద్ధులు,పేదలు, అర్హులైన లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన దరఖాస్తు దారుల దరఖాస్తులను వెంటనే పరిశీలించి, అవసరమైన ఆదాయ,కుల ధ్రువీకరణ పత్రాలను వీలైనంతత్వరగా అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మెట్‌పల్లి పట్టణ నాయకులు పూదారి సుధాకర్ గౌడ్, భీమనాతి సత్యనారాయణ, ఏనుగందుల శ్రీనివాస్ గౌడ్, మొరపు తేజ, లంక గంగాధర్, ఆకుల ప్రవీణ్, విష్ణు, జక్కం బాబు, ధ్యావనపెల్లి ప్రసాద్, జావిద్, శ్యామ్, రమేశ్, మహేశ్, మొరపు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

## శ్రావణమాసం 2 వ రోజు పంచామృత అభిషేకం

గజ్వేల్:14 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గజ్వేల్ పట్టణ కేంద్రంలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రావణమాసం రెండవ రోజు శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు,ఆర్యవైశ్య నాయకులు మర్యాల శ్రీనివాస్,రమాదేవి దంపతులు,తోట వీరేశం,సావిత్రి దంపతులు వారి



కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు బొగ్గుల సురేష్ గురు స్వామి,మాట్లాడుతూ ఎక్కడా లేనివిధంగా గజ్వేల్ శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా స్వామివారికి దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించే కార్యక్రమం గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహించడం జరుగుతుందని శ్రావణమాసం నెల రోజులు ప్రతి రోజు ఇద్దరు దంపతులచే స్వామివారికి అభిషేకం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని,స్వామివారి పూజలో పాల్గొనే దంపతులు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని, శ్రావణమాసం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి కరుణాకటాక్షాలు పొందాలని భక్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాచారం దేవస్థానం డైరెక్టర్,అయ్యప్ప ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు జగ్గయ్యగారి శేఖర్, ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ,కోశాధికారి నారాయణరెడ్డి,కార్యదర్శి గోపి, నాయకులు గందె యాదగిరి,కైలాస ప్రశాంత్,శ్రావణ్,అభిలాష్,మణికంత, మల్లారెడ్డి,ఎరవాడ యాదగిరి,విక్రాంత్, దీపక్,గందె సంతోష్,ఫణి, జనార్దన్, పెంటరెడ్డి,అయ్యప్ప స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ బహిరంగ లేఖ

## సంగమేశ్వర--బసవేశ్వర ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు వేగవంతం చేయాలి: గత ప్రభుత్వంలో మంజూరైన పనులను పూర్తి చేయాలని వినతి.

సంగారెడ్డి ప్రతినిధి ఆగస్టు 14( ప్రజా కలం):

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లాలోని రైతులు, ప్రజలు కీలక అభివృద్ధి పనులు, సాగునీటి ప్రాజెక్టులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పేర్కొన్నారు. సీఎం అధికారిక పర్యటన కేవలం రాజకీయ ప్రచారానికి పరిమితం కాకుండా సంగారెడ్డి జిల్లా అభివృద్ధికి ఉపయోగపడేలా స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రికి ఆయన బహిరంగ లేఖ రాశారు.

సంగమేశ్వర--బసవేశ్వర ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

సంగారెడ్డి, జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాల పరిధిలోని 19 మండలాల్లో సుమారు 397 గ్రామాలకు సాగునీరు అందించే సామర్థ్యం ఉన్న సంగమేశ్వర--బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు తక్షణమే నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని చింత ప్రభాకర్ డిమాండ్ చేశారు. దాదాపు 3.84 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టులు పూర్తయితే మెతుకుసీమ రైతాంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ప్రస్తుతం వర్షాధారంగా వ్యవసాయం చేస్తున్న రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని, ఈ ప్రాజెక్టులు పూర్తయితే వేలాది మంది రైతులకు శాశ్వత సాగునీటి భరోసా కలుగుతుందని చెప్పారు. పంటల సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు వ్యవసాయంపై ఆధారపడిన గ్రామీణ



కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు.

"ఈ ప్రాజెక్టులు పూర్తయితే వర్షాల కోసం ఆకాశం వైపు చూసే పరిస్థితి రైతులకు ఉండదు. వర్షాలు సకాలంలో పడకపోయినా సాగునీటి భరోసాతో రైతులు సమయానికి వ్యవసాయ పనులు చేపట్టి పంటలు పండించుకునే అవకాశం కలుగుతుంది. రైతులపై ఈ ప్రభుత్వానికి నిజంగా ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే సంగమేశ్వర--బసవేశ్వర వంటి కీలక ప్రాజెక్టులపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి" అని చింత ప్రభాకర్ అన్నారు.

గత హామీలను అమలు చేయాలి

"సీఎం పర్యటనలో కొత్త హామీలు ఇవ్వడం కంటే గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ముందుగా అమలు చేయాలి. ప్రకటనలకే పరిమితం కాకుండా సంగారెడ్డి అభివృద్ధికి అవసరమైన నిధులను వాస్తవంగా మంజూరు చేసి పనులు ప్రారంభించాలి" అని ఆయన స్పష్టం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంగారెడ్డికి నిధులు మంజూరు చేస్తున్నామని ప్రకటనల్లో చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు కనిపించడం లేదని విమర్శించారు.

"ప్రకటనల్లో నిధులు చూపించడం కాదు.. జీవోలు జారీ చేసి, నిధులు విడుదల చేసి, పనులు ప్రారంభించినప్పుడే సంగారెడ్డి ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతాయి" అని అన్నారు.

పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

వేజ్ అండ్ నాన్-వేజ్ మార్కెట్ యార్డులు:

గత ప్రభుత్వ హయాంలో మంజూరైన సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల వేజ్ అండ్ నాన్-వేజ్ మార్కెట్ యార్డు పనులను పూర్తి చేయాలని కోరారు. సంగారెడ్డికి రూ.9.31 కోట్లు, సదాశివపేటకు రూ.7.30 కోట్లు మంజూరు కాగా, అవసరమైన నిధులను విడుదల చేసి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

"సంగారెడ్డి జిల్లా ప్రజలు, రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్యలకు ఈ పర్యటనలో శాశ్వత పరిష్కారం చూపాలి. ముఖ్యంగా సంగమేశ్వర--బసవేశ్వర ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేసి పనులు వేగవంతం చేయాలి. పెండింగ్‌లో ఉన్న రహదారులు, మార్కెట్ యార్డులు పనులు, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, మినీ హజ్ హౌస్, మెట్రో రైలు పొడిగింపు, మహబూబ్ సాగర్ అభివృద్ధి, ఆలయాల అభివృద్ధిపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలి. ప్రకటనలు కాకుండా జీవోలు, నిధుల విడుదల, పనుల ప్రారంభంతో అభివృద్ధి పనులు క్షేత్రస్థాయిలో కనిపించాలి" అని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్పష్టం చేశారు.



# పండగ సాయన్న జయంతికి అధికారిక గుర్తింపు

## -అక్టోబర్ 22న ప్రభుత్వ ఆధ్వర్యంలో వేడుకలు..

పటాన్‌చెరు, ఆగస్టు 14 (ప్రజా కలం) ప్రతినిధి

నిజాం నిరంకుశత్వం, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి పేదల పక్షాన నిలిచిన బహుజన వీరుడు పండగ సాయన్న జయంతిని ఇకపై రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. ప్రతి ఏటా అక్టోబర్ 22న జయంతి వేడుకలు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. మంత్రి వాకిటి శ్రీహరి,మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్, మాజీ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ తదితరులు సచివాలయంలో సీఎంను కలిసి వినతిపత్రం సమర్పించారు. పండగ సాయన్న సేవలు, పోరాట స్ఫూర్తిని వివరించగా.. త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయంపై నీలం మధు హర్షం వ్యక్తం చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, చొప్పరి శంకర్, మహబూబ్‌నగర్ డీసీసీ సంజీవ్, ఖైరతాబాద్ డీసీసీ మోత రోహిత్, గుండ్లపల్లి శ్రీనివాస్, అల్లుడు జగన్, పిట్ల నగేష్, మద్దెల సంతోష్, మహేష్ సుంకరబోయిన, సాయన్న సేవాసమితి కృష్ణ, బలరాం, రాజశేఖర్, బక్క జనార్దన్, భీమ్ లక్ష్మణ్, పండగ బాలు, ఆగం పాండు, నిజ్జల రమేష్ తదితరులు పాల్గొన్నారు..

# నీటి ఎద్దడిలో ప్రజలకు అండగా జీవీఎంసీ అధికారులు

## వార్డుల్లో విస్తృతంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా




విశాఖపట్నం
ఆగస్టు 14 ( ప్రజా కలం ప్రతినిధి)

నగరంలో కొనసాగుతున్న నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జీవీఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నీటి కొరత అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన మేరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా 45, 46, 47, 48, 55వ వార్డుల పరిధిలో నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించారు.

బోర్లు ఎండిపోవడం, రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రతరమైంది. దీంతో అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నీటి అవసరం ఉన్న ప్రాంతాలకు ప్రాధాన్యతా క్రమంలో ట్యాంకర్లను మళ్లిస్తున్నారు.

క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ

వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, ఏఈ సుమన్ ఆధ్వర్యంలో సిబ్బంది వార్డుల్లో పర్యటిస్తూ నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్నారు. ఏ



ప్రాంతంలో నీటి సమస్య తలెత్తినా వెంటనే స్పందించి ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.

డీఈ సతీష్‌కుమార్, ఈఈ మురళీకృష్ణ సూచనల మేరకు నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్లను తరలిస్తున్నారు. వార్డు ఏఈ అంజలి కూడా ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానికుల సమస్యలను తెలుసుకుని, నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నారు.

ప్రజలకు అందుబాటులో నీటి సేవలు

నీటి ఎద్దడి నేపథ్యంలో ప్రైవేటు ట్యాంకర్ల ధరలు పెరుగుతున్నాయన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో జీవీఎంసీ ఆధ్వర్యంలోని నీటి సరఫరా సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. అత్యవసరంగా నీరు అవసరమైన ప్రాంతాలను గుర్తించి అక్కడికి ట్యాంకర్లను పంపిస్తున్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ నీటి కొరతను



సాధ్యమైనంత మేరకు తగ్గించేందుకు కృషి చేస్తున్నారు. నీటి ఎద్దడి పూర్తిగా తొలగే వరకు ఇదే స్థాయిలో పర్యవేక్షణ, ప్రత్యామ్నాయ నీటి సరఫరా కొనసాగించాలని స్థానికులు కోరుతున్నారు.

స్థానికుల అభిప్రాయం: నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో అధికారులు స్వయంగా పర్యటించి పరిస్థితిని తెలుసుకోవడం, అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడం అభినందనీయమని స్థానికులు తెలిపారు. నీటి సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ఇదే విధంగా నిరంతర సేవలు కొనసాగించాలని వారు కోరారు.

# ఎల్లారెడ్డిలో బిజెపి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 14 ప్రజా కలం : భారత దేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రం లో బిజెపి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ చేపట్టినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. పట్టణం లో రామాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు, అక్కడ నుండి గాంధీ చౌక్, శివాజీ వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం పలువురు దుకాణాదారులకు జాతీయ జెండాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు మర్రి బాలకిషన్, జిల్లా నాయకులు మాజీ సర్పంచ్ బత్తిని దేవేందర్, పట్టణ అధ్యక్షులు రాజేష్, మండల అధ్యక్షులు పెద్దేడ్ల నర్సింలు, సాయిరెడ్డి, అశోక్, కాశినాథ్, సత్యం, శివ, రాజు, సాయిలు, సర్చేంద్, శ్రీనివాస్, తులసి, బబ్లు కౌశిక్, ఎస్ ఎన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# సబ్దల్పూర్ లో జాతీయ జెండాలు పంపిణీ చేసిన బిజెపి నేతలు

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 14 ప్రజా కలం : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలంలోని సబ్దల్పూర్ గ్రామంలో బిజెపి నాయకులు శుక్రవారం గ్రామస్తులకు జాతీయ జెండాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి మండల బిజెపి ప్రధాన కార్యదర్శి జక్కుల అశోక్ తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా దేశ ప్రధాని మోడీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు జాతీయ జెండాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ శనివారం తమ తమ ఇళ్లపై జాతీయ జెండాలు ఎగురవేసి వందనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ బిజెపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

## - విద్యుత్ ప్రమాద బాధిత కుటుంబాలకు బీమా చెక్కుల పంపిణీ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 14 ప్రజా కలం : ఈనెల 24న ఎల్లారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మదన్మోహన్రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే మెగా జాబ్ మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం ఎమ్మెల్యే మదన్మోహన్రావు విడుదల చేశారు. ఈ జాబ్ మేళాలో సుమారు 74 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, దీనిని నియోజకవర్గంలోని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన ముగ్గురు విద్యుత్ ప్రమాద బాధితుల కుటుంబ సభ్యులకు ఒకొక్కరికి ఐదు లక్షల రూపాయల చొప్పున ప్రమాద భీమా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 14 ప్రజా కలం : ఎల్లారెడ్డి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి ఒంటిగంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తు న్నట్లు ఎంపీడీవో తాహెరా బేగం తెలిపారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఆమె ఓ పత్రిక ప్రకట న విడుదల చేశారు. ఈ విషయాన్ని మండలం లోని ప్రజలు గమనించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## పెన్షన్ ధ్రువీకరణ పత్రాలు వెంటనే జారీ చేయాలి

### - తహశీల్దార్‌కు బీఆర్ఎస్ నేతల వినతి



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 14 (ప్రజాకలం) రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్న అర్హులైన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరుతూ మెట్‌పల్లి పట్టణ బీఆర్ఎస్ పార్టీ నాయకులు తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఈ వినతి కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియలో అవసరమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను త్వరితగతిన జారీ చేయాలని వారు కోరారు. ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం కారణంగా వృద్ధులు, పేదలు, అర్హులైన లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన దరఖాస్తుదారుల దరఖాస్తులను వెంటనే పరిశీలించి, అవసరమైన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను వీలైనంత త్వరగా అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మెట్‌పల్లి పట్టణ నాయకులు పూదారి సుధాకర్ గౌడ్, భీమనాతి సత్యనారాయణ, ఏనుగందుల శ్రీనివాస్ గౌడ్, మొరపు తేజ, లంక గంగాధర్, ఆకుల ప్రవీణ్, విష్ణు, జక్కం బాబు, ధ్యావనపెల్లి ప్రసాద్, జావిద్, శ్యామ్, రమేశ్, మహేశ్, మొరపు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో ఒత్తిడి దూరం

### - మున్సిపల్ చైర్మన్ మైలరపు లింబాద్రి



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 14 (ప్రజాకలం) క్రీడలతో ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ మైలరపు లింబాద్రి పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మెట్‌పల్లి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది మధ్య ప్రత్యేక స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్‌ను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. కౌన్సిలర్స్ వర్సెస్ మున్సిపల్ స్టాఫ్’ పేరుతో నిర్వహించిన ఈ మ్యాచ్‌ను మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మైలారపు లింబాద్రి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది మధ్య స్నేహభావం, సమన్వయం మరింత పెంపొందించేందుకు ఇలాంటి క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. విధుల్లో ఎదురయ్యే పని ఒత్తిడిని దూరం చేసుకోవడంతో పాటు పరస్పర స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించేందుకు క్రీడలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి పురపాలక సంఘానికి చెందిన కౌన్సిలర్లు, అధికారులు, కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని క్రికెట్ మ్యాచ్‌ను విజయవంతం చేశారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్.. ఎరువుల ధరలు తగ్గించాలి




గద్వాల ప్రతినిధి ఆగస్టు 14 ప్రజా కలం:పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు రైతుల ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార పాదయాత్ర గద్వాల జిల్లా కేంద్రంలో ముగిసింది. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించి వైఎస్సార్ సర్కిల్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించి ప్రజలపై భారాన్ని తగ్గించాలని, రైతులకు ఎరువులను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజా సంక్షేమం, దేశ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మికులు, రైతులు, యువత, మహిళలు, ప్రజలు వేలాదిగా తరలిరావాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జి. రంగన్న పిలుపునిచ్చారు. ప్రజా, కార్మిక, రైతు సమస్యల పరిష్కారం కోసం సీపీఐ పోరాటం కొనసాగిస్తుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు, రైతులు, హమాలీలు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గద్వాల ప్రతినిధి ఆగస్టు 14 ప్రజా కలం: జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన వడ్డే వెంకటన్న (60), సన్నాఫ్ భీమన్న, అనారోగ్యంతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత రెండేళ్లుగా పక్షవాతంతో బాధపడుతున్న వెంకటన్న, గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా, శుక్రవారం అర్ధరాత్రి 12:40 గంటలకు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసును ఏఎస్ఐ ఈశ్వరయ్య దర్యాప్తు చేస్తున్నారు.



## గట్టు ప్రభుత్వ స్థలంపై అక్రమ నిర్మాణాలు

### అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

గద్వాల ప్రతినిధి ఆగస్టు 14 ప్రజా కలం:

జోగులాంబ గద్వాల జిల్లా గట్టు గ్రామ పంచాయతీ పరిధిలోని చింతలకుంట రోడ్డులో ఉన్న విలువైన గ్రామకంఠం (ప్రభుత్వ) స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఉపసర్పంచ్ అంజనమ్మ అంజనేయులు, వార్డు సభ్యులు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ఉప్పరి దొడ్డెప్ప కుమారులు ఉప్పరి సత్యనారాయణ, యుగంధర్, గోవిందప్ప, కృష్ణమూర్తి అనే నలుగురు సోదరులు సుమారు 70ఐ80 అడుగుల గ్రామకంఠం స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఎలాంటి చట్టబద్ధమైన హక్కు పత్రాలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేకపోయినా, గతంలో సృష్టించినట్లు చెబుతున్న పత్రాలను చూపిస్తూ అక్కడ అక్రమంగా షాపులు నిర్మించారని తెలిపారు. గ్రామంలో ఇతరులు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తే వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ, అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని



ఆరోపించారు. అలాగే అధికారులను సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సదరు స్థలానికి సంబంధించిన హక్కు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామకంఠం ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంజనమ్మ అంజనేయులు, వార్డు సభ్యులు టి. రేవతి, వెంకటేష్, రోల్లి రేనమ్మ, కంగారు తిమ్మప్ప, రంగస్వామి, జక్కలి మునిస్వామి, సోంపురం తిమ్మప్ప, సంతోష్ పాల్గొన్నారు.

## విప్లవ యోధుడు రాయల చంద్రశేఖర్ ఆగస్టు 16న స్మారక పుస్తకావిష్కరణ సభ

పాలేరు ఆగస్టు 14( ప్రజా కలం న్యూస్ )

విప్లవ యోధుడు ఆదర్శ కమ్యూనిస్టు రాయల చంద్రశేఖర్ పుస్తకావిష్కరణ సభ ఆగస్టు 16న ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు చంద్రశేఖర్ జీవిత సహసరి రాయల విమల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ. విప్లవం అంటే విందు భోజనం కాదు. విప్లవ ప్రేమ అంటే విహారాలు, విరహాలు, సరదాలు కాదు. ముళ్లూ, రాళ్లూ, అవాంతరాలూ ఉంటాయని తెలిసినా, ప్రాణాన్ని కాపాడుకోవడానికి కాదు–ప్రాణాన్ని అర్పించడానికి సిద్ధపడి, నూనూగు మీసాల నవయవ్వనంలోనే అడవుల్లోకి దూకిన యువకుడు రాయల చంద్రశేఖర్. అమ్మ అమాయకంగా పెట్టిన ‘చంద్రశేఖర్’ అనే పేరును, ఆజాద్ చంద్రశేఖర్ స్ఫూర్తితో తన జీవితానికే అర్థంగా మార్చుకున్న విప్లవ యోధుడు ఆయన. రాయల గోపాలకృష్ణయ్య–రాంబాయమ్మల ముద్దుల కొడుకు. అప్పయ్య, సుభాష్ చంద్రబోస్, నాగేశ్వరరావుల సోదరుడు. పోరాటాన్ని వారసత్వంగా స్వీకరించి, యాభై ఏళ్ల పాటు విప్లవోద్యమంలో అవిశ్రాంతంగా నడిచిన మనిషి. ప్రేమించి పెళ్లాడిన జీవిత సహచరి విమలతో పాటు, కొడుకు పావెల్, కోడలు కీర్తి, మనవలు అపూర్వకృష్ణ, ఆజాద్‌కృష్ణలను కూడా తన విశ్వాసాల బాటలో నడిపించిన ఆదర్శనీయుడు. తన కుటుంబాన్నే సమాజ మార్పు ప్రయాణంలో భాగస్వాములను చేసిన విప్లవ ప్రేమికుడు. ఇంత సుదీర్ఘ పోరాటం తర్వాత, అలసి సొలసి ఒక “భగ్న విప్లవ ప్రేమికుడిగా” ఆయన నిష్క్రమణ ఒక వ్యక్తి విషాదం మాత్రమే కాదు–విప్లవోద్యమాలకు ఒక హెచ్చరిక. ఆయన మరణం ఒక మానని గాయం. ఆయన జీవితం ఒక అనుభవాల భాండాగారం. ఆయన నిష్క్రమణ ఒక ప్రశ్న. మనిషి కోసం సమాజాన్ని మార్చాలనుకునే మనం–మనిషిని కోల్పోకుండా ఉండేందుకు మనలో ఏమి మార్చుకోవాలి? చంద్రశేఖర్ జీవితాన్ని స్మరించడం మాత్రమే ఆయనకు నివాళి కాదు. ఆయన అనుభవాల నుంచి నేర్చుకుని, మానవీయ విలువలతో సమాజ మార్పు కోసం పోరాడటమే ఆయనకు నిజమైన నివాళి అని, ఈ నేపథ్యంలో విప్లవ యోధుడు రాయల చంద్రశేఖర్ స్మారకంగా పుస్తకావిష్కరణ సభను ఆయన జీవిత సహచరి రాయల విమల, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల ఆధ్వర్యంలో 2026 ఆగస్టు 16వ తేదీన ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నారు. ఈ సభకు ప్రముఖ పత్రికా సంపాదకులు సతీష్ చందర్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ సందర్భంగా పలు విప్లవ, వామపక్ష పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని రాయల చంద్రశేఖర్ జీవితం, ఆయన సుదీర్ఘ విప్లవ ప్రస్థానం, అనుభవాలు, ఉద్యమ జీవితంలోని మానవీయ కోణాలపై ప్రసంగిస్తారు. కావున ప్రజలు, ప్రజాస్వామికవాదులు, అభ్యుదయవాదులు, మిత్రులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ పుస్తకావిష్కరణ సభను విజయవంతం చేయాలని ఆమె కోరారు.



## ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా మహిళా సంఘాలు పనిచేయాలి

### - డిజిటల్ మోసాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలి

### - స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా జరుపుకోవాలి



ఖమ్మం ఆగస్టు 14( ప్రజా కలం న్యూస్)

తెలంగాణ వీరనారి మహిళా సంఘం జిల్లా కమిటీ సమావేశం సిహెచ్ సత్యవతి అధ్యక్షతన అంబేద్కర్ భవనము ప్రాంగణంలో జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ వీరనారి మహిళా సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు పి ఆర్ దేవి పాల్గొని మాట్లాడారు . ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా మహిళా సంఘాలు పనిచేయాలని కోరారు . నేడు జరగబోయే స్వాతంత్ర్య వేడుకలలో మన దేశభక్తిని చాటి చెప్పేలా భారత జాతీయ జెండా రెపరెపలాడేలా ఎగిరివేయాలని అన్నారు . స్వాతంత్ర్యం వచ్చి 8 దశాబ్దాలవుతున్నా మహిళలు ఇళ్లల్లో గాని మరియు ఉద్యోగంలో గాని , సమాజంలో , ప్రయాణంలో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట అవమానాల పాలవుతున్నారని పేర్కొన్నారు . రోజురోజుకు ఆడపిల్లలపై , మహిళలపై హత్యాచారాలు , మానభంగాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు . ఎప్పుడైతే మహిళలకు ప్రత్యేక చట్టాలు ఏర్పాటు చేసి కొత్త చట్టాలు తీసుకొస్తారో అప్పుడు సమాజంలో మహిళలకు అరుదైన గౌరవం దక్కిందన్నారు . ఒకప్పుడు స్వాతంత్ర్య దినోత్సవం వస్తోందంటే పిల్లల్లో ఆనందం ఉండేది . స్కూల్ అంతా పండుగ వాతావరణం ఉండేది . నేడు అదే పండుగ కేవలం మొక్కుబడి తంతుగా , ఓ సెలవు దినంగా మారిపోయింది . రాష్ట్రంలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికలలో మహిళలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు . కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఫ్రీగా స్కిల్ ట్రైనింగ్ ఇచ్చి స్కిల్ పోర్టల్ ద్వారా సంబంధిత సేవలను అందించి ట్రాన్స్పోర్ట్ , స్టే , ఫుడ్ , స్టడీ మెటీరియల్ , ఎగ్జామ్ ఫీ , సర్టిఫికేషన్ వంటి సౌకర్యాలు కల్పించాలని అన్నారు . ఇంటికే పరిమితమైన మహిళలు అనారోగ్యం , ఆహార అలవాట్లు పై అవగాహన కలిగి ఉండాలి అలాగే డిజిటల్ మోసాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు . పేదలకు ఇచ్చే రూ. 5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల విషయంలో ప్రభుత్వం వందల రూల్స్ పెట్టకుండా సానుకూలంగా స్పందించాలని కోరారు . రానున్న రోజుల్లో తెలంగాణ వీరనారి మహిళా సంఘం జిల్లా మహాసభలతో పాటు అన్ని జిల్లాల్లో కమిటీలు వేసుకోవాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ వీరనారి మహిళా సంఘం జిల్లా నాయకులు కటకం వెంకటలక్ష్మి , తిప్పర్తి రమ్య , మండల్ భవాని , బత్తుల ఉపేంద్ర , పరిక భవాని , ఎస్ స్రవంతి , బంక స్వాతి , తల్లాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల పలు దుకాణాలపై అధికారులు ఆకస్మిక దాడులు



ఎండపల్లి, ఆగస్టు 14 : ( ప్రజా కలం ప్రతినిధి ) రైతులకు నాణ్యమైన ఎరువులు, సరైన ధరలకే అందేలా చూడటమే లక్ష్యంగా ఎండపల్లి మండల కేంద్రం లో మండల తహసిల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, మండల వ్యవసాయ అధికారి కామల్ల మహేష్ పలు ఫెర్టిలైజర్ దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా దుకాణాల్లోని నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్స్, పాయింట్ ఆఫ్ సేల్ పిఓఎస్ మిషన్ల సమా చారాన్ని క్షుణ్ణంగా పరిశీ లించారు. దుకాణాల్లోని భౌతిక నిల్వలకు, రిజిస్టర్ల లోని వివరాలకు తేడాలు ఉంటే కఠిన చర్యలు ఉంటాయని వ్యాపారులను హెచ్చరించారు. ఎం.ఆర్.పి కంటే ఎక్కువ ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా చట్ట రీత్యా చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. రైతులకు ప్రతి కొనుగోలుకు తప్పని సరిగా రశీదులు ఇవ్వాలని అధికారులు వ్యాపారులను హెచ్చరించారు.

## తిమ్మప్ప స్వామి సన్నిధిలో భక్తులకు అన్నదానం

### - సీడ్ ఆర్గనైజర్ శేషంపల్లి నరసింహులు



గద్వాల ప్రతినిధి ఆగస్టు 14 ప్రజా కలం: జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర (తిమ్మప్ప) స్వామి సన్నిధిలో శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు శేషంపల్లి నరసింహులు తెలిపారు. అన్నదాతల క్షేమం, సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ మల్దకల్ మండలంలోని వివిధ గ్రామాల భజన కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో భజనలు చేస్తూ స్వామివారిని ప్రార్థించడం అభినందనీయమన్నారు. శనివారం నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని శేషంపల్లి నరసింహులు కోరారు.

## గద్వాలలో రెపరెపలాడిన త్రివర్ణం..

### ఘనంగా తిరంగా ర్యాలీ



గద్వాల ప్రతినిధి ఆగస్టు 14 ప్రజా కలం:

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హీరూణ కాలేజ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్, కృష్ణవేణి చౌక్, రాజీవ్ మార్గ్ మీదుగా కొనసాగింది.

ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు. ర్యాలీలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు రామాంజనేయులు, బండల వెంకటరాములు, రామచంద్రరెడ్డి, శివారెడ్డి, జయశ్రీ, కౌన్సిలర్లు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ టీ-షర్టుల పంపిణీ

తానూర్, ఆగస్టు 14(ప్రజా కలం): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆలయ కమిటీ చైర్మన్ దొంతుల పోశెట్టి శుక్రవారం ఉచితంగా స్పోర్ట్స్ టీ–షర్టులను పంపిణీ చేశారు. పాఠశాలకు చెందిన 125 మంది విద్యార్థులకు ఆయన సొంత ఖర్చులతో వీటిని అందజేశారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగా చరణ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు మల్లన్న, డాక్టర్ రాజు, వార్డు సభ్యుడు సాయినాథ్ పవార్‌లతో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు,దాత పోశెట్టికి పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.



## ట్రెండ్ హ్యుందాయ్ షో రూమ్ ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నాగర్ కర్నూల్ ఆగస్టు 14 ప్రజా కలం (ప్రతినిధి): శుక్రవారం నాడు జిల్లా కేంద్రంలో ని హౌసింగ్ బోర్డు నందు ట్రెండ్ హ్యుందాయ్ షో రూమ్ ను శాసనసభ్యులు డా. కూచుకుళ్ల రాజేష్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకున్న యువత తమ సొంత కాలఖై నిలబడి బిజినెస్ రంగంలో అభివృద్ధి చెందాలని అన్నారు ఇలాంటి రంగాల్లో అనునిత్యం కృషితో పాటు లక్ష్యాన్ని నెరవేర్చుకునే దిశలో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు,మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు,కౌన్సిలర్స్ అనంత అలివేలమ్మ హర్ష , మాధవి రాజు , సునీత హరీష్ గౌడ్ ,శంకర్ ,గౌసియా బేగం ఇషాక్ తదితరులు పాల్గొన్నారు



## ఘనంగా నూతన శ్రీ నేత్ర ఆప్టికల్స్ స్టోర్ ప్రారంభం

### – యువత సేవా మార్గం వైపు అడుగులు వేయాలి
### – డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రు నాయక్

మరిపెడ ప్రజా కలం న్యూస్ ఆగస్ట్ 14 : మహబూబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని కార్గిల్ సెంటర్ నందు గౌరవ డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ శ్రీ జాటోత్ రాంచంద్రు నాయక్ చేతుల మీదుగా శ్రీ నేత్ర ఆప్టికల్ కంటి ఆసుపత్రి ఘనంగా ప్రారంభం అయింది రిబ్బన కట్ చేసి నూతన షాప్ ని ప్రారంభించారు వారి వెంట మున్సిపాలిటీ చైర్మన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి లు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువకులు వ్యాపార రంగంతో పాటు సేవా మార్గం వైపు అడుగులు వేయాలి అన్నారు వైద్య పరికరాలు మరియు ప్రజలకు అందుబాటు ధరలలో స్పెడ్స్ డ్రాప్స్ లాంటి క్వాలిటీ వస్తువులు స్టోర్లో అందిస్తున్నారు అన్నారు ప్రజలందరూ ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అన్నారు ఇలాగే ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందుబాటు ధరలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుగులోతు రవి పార్టీ టౌన్ అధ్యక్షులు వానబోధయంలాల్ కౌన్సిలర్లు గంధసిరి బిక్షపతి బాలాజీ సొందు లింగయ్య సత్యం తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య..

### - మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకొని ఉన్నత పదవులను అధిరోహించాలి..
### - మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు ఆకాంక్ష..

తల్లాడ అక్టోబర్ 14 ( ప్రజా కలం న్యూస్): వరుసగా మూడుసార్లు హ్యాట్రిక్ విజయం సాధించి సత్తుపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన నిస్వార్ధ నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అని తల్లాడ మండలం నూతనకల్లు మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు అన్నారు. నేడు మాజీ ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని మండలాలను సండ్ర అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లిన సండ్రా చేసిన అభివృద్ధి కనిపిస్తాయని అన్నారు. మారుమూల ప్రాంతాల్లో సైతం గ్రామాల్లో సిసి రోడ్లు వేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అభివృద్ధి చేసిన ఎమ్మెల్యేపై కొందరు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, అది సరైనది పద్ధతి కాదన్నారు. ఆయన మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని, రానున్న రోజుల్లో ఉన్నత పదవులను అధిరోహించాలని శ్రీనివాసరావు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేకు ఆయన ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## అబద్దపు సర్వేలను చూసి కలతాచేందవద్దు

### - నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ



( నందిగామ ఆగస్ట్ 14 ప్రజా కలం ప్రతినిధి) షాద్నగర్ నియోజకవర్గ పజలకు మీడియా మధ్యమాలలో ఆధారాలు లేకుండా ప్రచారమవుతున్న అబద్దపు సర్వేలను చూసి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ స్పష్టం చేశారు కాంగ్రెస్ పార్టీ ప్రజల హృదయాల్లో ఉందని మన ప్రభుత్వ చేసే సంక్షేమ పతకాలు మరియు సంక్షేమ పాలనపై ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని మల్లీ షాద్నగర్ నియోజకవర్గంలొ మన వీర్లపల్లి శంకర్ అన్న గెలుపు ఖాయమని పార్టీ కార్యకర్తలు ప్రజలు ఏవరు ఆందోళనచెంద వద్దు అని అన్నారు.

## నిబంధనలు పాటించని ఎరువుల డీలర్లపై కఠిన చర్యలు

### - మండల వ్యవసాయ అధికారి బి. శ్రీజ

మల్లూర్, ఆగస్టు 14 ప్రజాకలం ప్రతినిధి... రైతులకు విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి బి. శ్రీజ హెచ్చరించారు. శుక్రవారం కొయ్యూరు రైతు వేదికలో డీలర్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 20 నుండి జిల్లాలో ఎఫ్ ఎఫ్ యస్ సెంట్రల్ ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ అందుబాటులోకి రానుందని, ఇకపై అన్ని ఎరువుల విక్రయాలు ఈ యాప్ ద్వారానే జరుగుతాయని తెలిపారు. ప్రభుత్వ బోనస్ వర్తించాలంటే రైతులు కొన్న 7 రకాల వరి విత్తనాల వివరాలను వెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు. డీలర్లు తమ లైసెన్స్‌ను దుకాణంలో ప్రదర్శించాలని, అనుమతి ఉన్న గోదాముల్లోనే సరుకు నిల్వ చేయాలని స్పష్టం చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కులను వ్యవసాయ అధికారితో సర్టిపై చేయించాలని, రైతులకు రసీదు లేకుండా విక్రయాలు చేయవద్దన్నారు. ఎరువులు, విత్తనాలను లూజ్ గా అమ్మకుండా, కేవలం ప్యాకెట్ల రూపంలోనే ఈ-పోస్ (వ్రాశీూ) మెషిన్ ద్వారా ఆధార్ వేలిముద్రతో విక్రయించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిని ఎస్ అనూష, డీలర్లు పాల్గొన్నారు.




## ఎన్టీఆర్ కళాశాలలో అవయవదానంపై అవగాహన సదస్సు



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 14:

మహబూబ్‌నగర్‌లోని స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ & పీజీ కళా శాల (అటానమస్)లో అఖిల భారత అవయవదాతల సంఘం సమన్వయంతో, జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన సదస్సును విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా పాల్గొన్న అఖిల భారత అవయవదాతల సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ వి. నటరాజ్ మాట్లాడుతూ, "మరణం తర్వాత శరీరం మట్టిలో కలిసిపోతుంది. కానీ అవయవాలను దానం చేస్తే అవి మరొకరి శరీరంలో జీవిస్తాయి. ఒక కుటుంబం తీసుకునే ధైర్యమైన నిర్ణయం మరో కుటుంబానికి కొత్త ఆశను, సరికొత్త జీవితాన్ని అందిస్తుంది. అందుకే ఇది సాధారణ దానం కాదు, జీవితాన్ని అందించే మహాదానం" అని అన్నారు. తమ సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ మరియు ఎస్.వి.ఎస్. మెడికల్ కాలేజీకి 273 కళ్లను, 18 డెడ్ బాడీలను దానం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ, "మన జీవితం ఒకరోజు ముగుస్తుంది. కానీ మన మానవత్వానికి ముగింపు ఉండకూడదు. మన హృదయం ఆగిపోయినా, మన మంచి నిర్ణయం మరొకరి జీవితంలో కొనసాగవచ్చు. మన కళ్ళు ఈ ప్రపంచాన్ని చూడకపోయినా, మరొకరు ఈ అందమైన ప్రపంచాన్ని చూడగలరు. అందుకే అవయవదానం చేయండి. జీవితాన్ని పంచండి. ఆశను పంచండి" అని అన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అమీన ముంతాజ్ జహాన్ మాట్లాడుతూ, "సమాజంలో అవయవదానంపై ఎన్నో అపోహలు ఉన్నాయి. విద్యావంతులుగా, సైన్స్ విద్యార్థులుగా ఆ అపోహలను తొలగించాల్సిన బాధ్యత మనపై ఉంది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ముందుకు వచ్చి అవయవదానం చేస్తే ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నిండుతాయి. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా మనం తెలుసుకున్న విషయాలను మన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు మరియు సమాజానికి చేరవేద్దాం. అవయవదానంపై అవగాహన పెంచుదాం, మానవత్వాన్ని చాటుకుందాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కన్వీనర్ వేణుగోపాల్, బాబులెరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ అనురాధ, డాక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్, రఘువీర్ గుప్త, అదిబాతాజ్, నసీంభాను, వెంకటరమణ మూర్తి, డాక్టర్ సీ. హెచ్. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

### - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 14 :

జిల్లాలోని పి.ఎం. శ్రీ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న కేంద్ర నిధులను నిబంధనల ప్రకారం సక్రమంగా వినియోగించి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని అన్ని పి.ఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ పాఠశాలల్లో కేంద్ర నిధుల వినియోగం, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పి.ఎం.శ్రీ ద్వారా పాఠశాలలకు అందిన నిధులను పాఠశాల అవసరాలకు అనుగుణంగా వినియోగించి, ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలిచేలా పి.ఎం.శ్రీ పాఠశాలలను అభివృద్ధి చేయాలని సూచించారు.

అందుబాటులో ఉన్న నిధులను వచ్చే వారంలోపు పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. పాఠశాలల్లో డ్రైనేజీ, గేట్లు, తలుపులు, కిటికీలు, ఫ్యాన్లు, లైట్లు, ర్యాంపులు తదితర సౌకర్యాల్లో చిన్నపాటి లోపాలు కూడా లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా బాలికల మరుగుదొడ్లలో తలుపులు, లైట్లు వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తరగతి గదుల్లోని అన్ని ఫ్యాన్లు పనిచేసేలా చూడాలని సూచించారు. దెబ్బతిన్న తలుపులు, కిటికీలు, ర్యాంపులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. పి.ఎం.శ్రీ పాఠశాలలకు నిధుల విషయంలో ఎలాంటి సమస్య లేదు. కేవలం నిధులు ఖర్చు చేసినట్లు చూపించడం కాకుండా, వాటి వినియోగంతో పాఠశాలల్లో స్పష్టమైన మార్పు కనిపించేలా చర్యలు తీసుకోవాలి" అని కలెక్టర్ అన్నారు. త్వరలో పి.ఎం . శ్రీ పాఠశాలలను క్షేత్రస్థాయిలో సందర్శించనున్నట్లు ఆమె తెలిపారు. వచ్చే వారం నుంచి తన పర్యటనల్లో పీఎం శ్రీ పాఠశాలలకు ప్రాధాన్యం ఇస్తామని, ప్రధానోపాధ్యాయులు పాఠశాల వారీగా అవసరాలను ముందుగానే గుర్తించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఖర్చుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలి

పి. ఎం .శ్రీ నిధులతో చేపట్టిన ప్రతి పనికి సంబంధించిన ఖర్చుల వివరాలను పాఠశాల రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. మరమ్మతు పనులకు ముందు, పనులు పూర్తయిన తర్వాత ఫొటోలు తీసి, వాటితో పాటు తేదీ, జీపీఎస్ కోఆర్డినేట్ల వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన ఫైళ్లలో కూడా బిఫోర్-ఆఫ్టర్ ఫొటోలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.

విద్యార్థులకు అందిస్తున్న స్వీయ రక్షణ శిక్షణను కేవలం నిధుల వినియోగం కోసం నిర్వహించే కార్యక్రమంగావి చూడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థులకు వాస్తవంగా స్వీయ రక్షణ నైపుణ్యాలు అందుతున్నాయా లేదా పరిశీలించాలని, శిక్షణా సామగ్రి, ఇతర వసతులను సమర్ధవంతంగా వినియోగించి కార్యక్రమాన్ని ప్రయోజనకరంగా నిర్వహించాలని సూచించారు.

పాఠశాలలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా, సక్రమంగా నిర్వహించి విద్యార్థులకు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు పరస్పరం తమ అనుభవాలు, ఉత్తమ విధానాలను పంచుకుని, ఒక పాఠశాలలో విజయవంతమైన కార్యక్రమాలను ఇతర పాఠశాలల్లోనూ అమలు చేసేలా సహకారం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని తదితరులు పాల్గొన్నారు.

## గ్రీన్ సిటీ వెంచర్‌లో భారీ మోసం

### లక్షలు పోసి రోడ్డున పడ్డ కుటుంబాలు - అభివృద్ధి హామీలన్నీ బూటకమే
### మరిపెడలో ప్లాట్ల కొనుగోలుదారుల ఆందోళన - జీవితకాలం కష్టం నీళ్లపాలైంది
### మరిపెడ గ్రీన్ సిటీ బాధితుల కన్నీరు



మరిపెడ,ఆగస్టు 13 ప్రజా కలం న్యూస్

జీవిత కాలం కష్టపడి సంపాదించిన సొమ్ముతో భూమి కొనుక్కుంటే భవిష్యత్తు బాగుంటుందని,పిల్లల అవసరాలకు వనికొస్తాయని ఆశించి ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోయామని,ఆశలు గాలిలో కలిసిపోయాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బయ్యపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో గ్రీన్ సిటీ పేరుతో వెంచర్ ఏర్పాటు చేసిన చంద్రు రాజ్ కుమార్ తమను మోసం చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.గురువారం మీడియా సమావేశం నిర్వహించిన బాధితులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. సుమారు 10 ఏళ్ల క్రితం రాజ్ కుమార్ ఆకర్షణీయమైన బ్రోచర్లు,లేఔట్ మ్యాప్‌లు చూపించి ప్లాట్లు విక్రయించారని తెలిపారు.వెంచర్ చుట్టూ పహరీ గోడ,అందులోపల చిల్డ్రన్ పార్క్,ప్రతి స్ట్రీట్‌కు లైట్లు,విద్యుత్,ప్రతి ప్లాట్‌కు మంచినీటి కనెక్షన్ కల్పిస్తామని నమ్మ బలికారని ఆరోపించారు.కానీ పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించిన తర్వాత కూడా ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని,మరి కొంతమందికి రిజిస్ట్రేషన్ కూడా పూర్తి చేయలేదని బాధితులు ఆరోపించారు. ప్రస్తుతం ఆ వెంచర్‌లో రోడ్లు,డ్రైనేజీ,ఇతర సౌకర్యాలు ఏమీ లేవు.దీంతో అక్కడ ఇల్లు కట్టుకుందామన్నా,ప్లాటు అమ్ముకుందామన్నా కొనేటందుకు ఎవరూ ముందుకు రావడం లేదని వాపోయారు.భూమిపై పెట్టుబడి పెడితే నష్టం ఉండదని నమ్మి మోసపోయాం.ఇప్పుడు ఫోన్ చేసినా వెంచర్ చేసిన రాజ్ కుమార్ సమాధానం ఇవ్వడం లేదు.అడిగితే బాధ్యతారా హిత్యంగా మాట్లాడుతున్నాడని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంచర్ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్.తక్షణమే వెంచర్ నిర్వాహకుడు చంద్రు రాజ్ కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని,తమకు న్యాయం చేయాలని,ఇచ్చిన హామీల మేరకు సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వానికి,అధికారులకు విజ్ఞప్తి చేశారు.

భాధితులు: 1.కేలోత్ భిక్షపతి-బిల్యా నాయక్ తండా,కాంపల్లి. 2.కేలోత్ లచ్చిరాం-బిల్యా నాయక్ తండా,కాంపల్లి. 3.మాలోత్ ప్రతాప్ సింగ్-మాంజ్యా తండా,ఎడ్జెర్ల. 4.మాలోత్ కిరణ్-ఎడ్జెర్ల. 5.బోడ వెంకన్న-బిల్యా నాయక్ తండా,కాంపల్లి. 6.చాపల సుభద్ర-కోటగడ్డ,బయ్యారం. 7.మిడ్తపల్లి నరసింహారావు-రఘునాథపాలెం. 8.గండు మల్లయ్య-రఘునాథపాలెం. భాధయులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని కోరుకుంటున్న భాధితులు...

## కాంగ్రెస్ అగ్రనాయకులపై అవమానకర వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

### – నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. రాజేష్ రెడ్డి



నాగర్‌కర్నూల్ ఆగస్టు 14ప్రజా కలం( ప్రతినిధి):కాంగ్రెస్ నాయకులు, అగ్రనాయకత్వంపై బీజేపీ చౌకబారు వ్యాఖ్యలు చేసినా, అవమానకరంగా ప్రవర్తించినా ఏమాత్రం సహించేది లేదని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి హెచ్చరించారు. బీజేపీ అప్రజాస్వామిక వైఖరికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను అవమానించేలా బీజేపీ నాయకులు వ్యవహరించడం వారి అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంకేశ్వర్ నిరంజన్, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వినోద్ కుమార్ తో పాటు కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాముకాటుతో నాలుగేళ్ల చిన్నారి హారిణి మృతి



( కొత్తూర్ అగస్ట్ 14 ప్రజా కలం ప్రతినిధి ) రంగారెడ్డి జిల్లా కొత్తూరు గ్రామానికి చెందిన వరికుప్పల రవి, వయసు 30 సంవత్సరాలు, స్వస్థలం నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలం తేటిపల్లి గ్రామం కాగా, జీవనోపాధి నిమిత్తం కుటుంబంతో కలిసి కొత్తూరుకు వచ్చి నివసిస్తూ, స్థలం లీజుకు తీసుకుని బ్రిక్స్ తయారీ కేంద్రం నిర్వహిస్తున్నాడు.తేదీ 13.08.2026న రాత్రి భోజనం అనంతరం రవి, అతని భార్య అనిత, పెద్ద కుమార్తె జెస్సి, చిన్న కుమార్తె హారిణి (వయస్సు 4 సంవత్సరాలు) కలిసి నిద్రించారు. అర్ధరాత్రి చిన్నారి హారిణి కుడి తొడపై ఏదో కరిచినట్లు బాధతో ఏడవడంతో కుటుంబ సభ్యులు నిద్రలేచి పరిశీలించాగ ఇంట్లో కట్లపాము కనిపించడంతో, చిన్నారి కుడి తొడపై పాము కాటు గుర్తులు ఉన్నట్లు గమనించ రవి వెంటనే చిన్నారిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు ఉస్మానియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. అనంతరం చిన్నారిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, అక్కడ ఉదయం సుమారు 3:00 గంటలకు వైద్యులు పరీక్షించి చిన్నారి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.ప్రాథమిక సమాచారం మేరకు పాముకాటు కారణంగానే చిన్నారి హారిణి మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ మరణంపై కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానం లేదని తండ్రి వరికుప్పల రవి తెలిపారు. ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

## మండల ప్రజావాణి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

### ఆగస్టు 17 నుంచి మండల ప్రజావాణి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు

ఖమ్మం, ఆగస్టు 14(ప్రజా కలం న్యూస్ ) మండల స్థాయిలో ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో ఆగస్టు 17వ తేదీ (సోమవారం) నుంచి ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించుచున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మండల కేంద్రాల్లోను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో మండల ప్రజావాణి నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల ప్రజావాణి కార్యక్రమాన్ని సంబంధిత ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించాలన్నారు. మండల ప్రజావాణి నిర్వహణకు అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణను ఆగస్టు 16వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లకు లాగిన్ ఐడీలు, యూజర్ గైడ్స్ అందజేయాలని సూచించారు.ప్రజావాణి నిర్వహించే ప్రదేశంలో ప్రజలకు, అధికారులకు అనుకూలంగా సీటింగ్ ఏర్పాట్లు చేయడంతో పాటు కంప్యూటర్, ప్రింటర్, స్కానర్ తదితర పరికరాలను సిద్ధంగా ఉంచాలని అన్నారు. మండల ప్రజావాణి ప్రారంభం, నిర్వహణపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని, మండల స్థాయి అధికారులందరూ తప్పనిసరిగా హాజరయ్యేలా ముందస్తుగా సమాచారం పంపాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్, డీఎంహెచ్ఓ డాక్టర్ రామారావు, డీసీఓ గంగాధర్, డీఎస్ఓ చందన్ కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస చారి, ఆర్డబ్ల్యూఎస్ ఇఇ వాణిశ్రీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.








# వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేయాలి : రాష్ట్రపతి ముర్ము

ఇంటర్నెట్ డెస్క్: దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు దేశ ప్రజలంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆమె సూచించారు. రాజ్యాంగం దేశ ప్రజలకు అందించిన హక్కులు, బాధ్యతలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి అన్నారు. యువత తమ ప్రతిభను ఉపయోగించుకుని తమ స్వప్నాలను సాకారం చేసుకోవడంతో పాటు దేశ ప్రగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో స్ఫూర్తిని నింపిన 'వందేమాతరం' గేయాన్ని గౌరవించాలని రాష్ట్రపతి ప్రజలను కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన న్యాయవ్యవస్థ, చట్టసభలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.


















# తెలంగాణ బిడ్డకు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం

**- ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా పుట్ట లక్ష్మణ్ ఏకగ్రీవ ఎన్నిక**

**- ఉత్తర ప్రదేశ్‌లో ముగిసిన 90వ వార్షికోత్సవ వేడుకలు**

**- ఉమ్మడి విద్యారంగ పరిరక్షణే ధ్యేయం.. పుట్ట లక్ష్మణ్**



మేడిపల్లి ఆగస్టు 14(ప్రజాకలం న్యూస్)

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బారాబంకి జిల్లాలో అత్యంత ఘనంగా నిర్వహించిన ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ 90వ వార్షికోత్సవ ముగింపు వేడుకలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ వేడుకల అనంతరం నిర్వహించిన జాతీయ కౌన్సిల్ సమావేశంలో తెలంగాణకు చెందిన ప్రముఖ విద్యార్థి నాయకుడు పుట్ట లక్ష్మణ్ ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

క్షేత్రస్థాయి నుంచి జాతీయ స్థాయికి.. నిరంతర పోరాటాల ప్రస్థానం మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా మేడిపల్లి మండలం, బోడుప్పల్ సర్కిల్, పీర్జాదిగూడ డివిజన్‌కు చెందిన పుట్ట లక్ష్మణ్ విద్యా రంగంలో పేద,మధ్యతరగతి విద్యార్థుల హక్కుల సాధనకై సుదీర్ఘకాలంగా పోరాడుతున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలోనే ఏఐఎస్ఎఫ్ సిద్ధాంతాలకు ఆకర్షితులై విద్యార్థి ఉద్యమంలో అడుగుపెట్టారు. మొదటగా ఘట్కేసర్ మండల అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించారు. తన నాయకత్వ పటిమతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా,ఆ తర్వాత జిల్లాల విభజన అనంతరం మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శిగా సమర్థవంతంగా పనిచేసి విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాడారు. 2022 సంవత్సరం కొత్తగూడెంలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 2026 ఫిబ్రవరి 18-20 నిజామాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో విద్యార్థి లోకం ఆయనపై ఉన్న నమ్మకంతో రెండవ సారి రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. 2026 ఆగష్టు 12-13 బారాబంకి,ఉత్తర ప్రదేశ్ 90వ వార్షికోత్సవ ముగింపు వేడుకల వేదికగా జరిగిన జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఆయనను జాతీయ ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

ఉమ్మడి విద్యారంగ పరిరక్షణే ధ్యేయం పుట్ట లక్ష్మణ్

నాపై నమ్మకంతో జాతీయ నాయకత్వం అప్పగించిన ఈ బాధ్యతను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహిస్తాను. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి, ప్రైవేటీకరణ, కాషాయీకరణ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి పోరాటాలను ఉధృతం చేస్తాం. విద్యార్థి వేధింపులు,ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ ఎప్పుడూ ముందువరసలో ఉంటుందని తెలియజేసారు. పుట్ట లక్ష్మణ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికవ్వడం పట్ల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, ప్రజాస్వామ్యవాదులు,విద్యార్థి సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# కాలుష్యంపై అధికారులు సమగ్ర విచారణ జరపాలి

**ప్రజా సంఘాల ధర్నాతో స్పందించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య,**
**-N&N టైర్ల కంపెనీపై ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ**



బొమ్మలరామారం, ఆగస్టు 14 (ప్రజా కలం)

ఎన్ అండ్ ఎన్ టైర్ల కంపెనీ నిబంధనలు ఉల్లంఘిస్తే ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అనుమతులు, నిబంధనలపై రెండు,మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలి అని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు మండలంలోని రంగపూర్ గ్రామ సమీపంలోని చీడచీ టైర్ల కంపెనీని ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శుక్రవారం రోజున ఆకస్మికంగా తనిఖీ చేశారు కంపెనీ ప్రాంగణంలో భారీగా నిల్వ ఉన్న టైర్లను,అక్కడ పనిచేస్తున్న కార్మికుల పరిస్థితిని పరిశీలించారు కనీస భద్రతా జాగ్రత్తలు లేకుండా కార్మికులు పనిచేస్తున్నారనే అంశంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు కంపెనీ నిర్వహణకు అవసరమైన అన్ని అనుమతులు ఉన్నాయా? లేదా? అనే పూర్తి సమాచారాన్ని రెండు,మూడు రోజుల్లో అందించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు సరైన అనుమతులు లేకుండా కంపెనీ నిర్వహిస్తున్నట్లు తేలితే నిబంధనల ప్రకారం కంపెనీని మూసివేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు అలాగే కంపెనీ వల్ల పరిసర గ్రామాల ప్రజలకు ఇబ్బందులు,కాలుష్య సమస్యలు తలెత్తుతున్నా యా అనే అంశంపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి రవి నాయక్ తో,యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతితో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించా రు. కంపెనీకి సంబంధిం చిన అనుమతులు, నిబంధనల అమలు, కాలుష్య ప్రభావంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి నివేదిక అందించాలని అధికారులకు సూచించా రు. నిబంధనలు, అనుమతుల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే ఎలాంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని బీర్ల అయిలయ్య ఆదేశించారు. ప్రజల ఆరోగ్యం,భద్రతకు ముప్పు కలిగించే పరిశ్రమల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రంగాపూర్ గ్రామ సర్పంచ్ యంజాల సరస్వతి గణేష్,వార్డ్ సభ్యులు,మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఆలయ పునర్నిర్మాణానికి రూ.1 లక్ష విరాళం సర్పంచ్ కి అందజేసిన మహేశ్వరం మండల కురుమ సంఘం అధ్యక్షుడు పోల్కాం బాలయ్య

మహేశ్వరం, ఆగస్టు 14, (ప్రజా కలం)

మహేశ్వరం మండల కురుమ సంఘం అధ్యక్షుడు పోల్కాం బాలయ్య



వారి కుటుంబ సభ్యులు తమ వంతుగా రూ. 100000/- (ఒక్క లక్ష రూపాయలు) విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని మహేశ్వరం గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ కి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా పోల్కాం బాలయ్య మాట్లాడుతూ, "గ్రామ ఆధ్యాత్మిక అభివృద్ధికి ప్రతీకగా నిలిచే గడికోట మైసమ్మ ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావడం మా అదృష్టంగా భావిస్తున్నాము. భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధికి మా పూర్తి సహకారం అందిస్తాము" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, కర్రోల్ల చంద్రయ్య, ఉప్ప సర్పంచ్ జోరుల రమేష్, కృష్ణ , కటికెల మహేందర్ , ఏపురి నరసింహా, రాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియారిటీ ఆధారంగా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎంఆర్ఓకు వినతి

**-కూకట్‌పల్లి ఎంఆర్ఓ అశోక్‌కుమార్ కు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ జర్నలిస్టులు**

**- జర్నలిస్టులకు ఇళ్ల కేటాయింపు నిష్పక్షపాతంగా జరగాలి**



**కూకట్‌పల్లి, ఆగస్టు 14, ప్రజా కలం ప్రతినిధి:**

కూకట్‌పల్లి మండల పరిధిలో జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరుతూ సీనియర్ జర్నలిస్టులు మండల రెవెన్యూ అధికారి అశోక్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కేటాయింపులో అర్హత, సీనియారిటీ, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించిన అనంతరం పారదర్శకంగా కేటాయింపులు చేపట్టాలని కోరారు. ఏ విధమైన రాజకీయ, వ్యక్తిగత లేదా ఇతర ప్రభావాలకు తావులేకుండా అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ను కలిసి ఇదే విషయం పై వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

సీనియారిటీ ఆధారంగా పరిశీలిస్తాం: ఎంఆర్ఓ

వినతి పత్రాన్ని స్వీకరించిన ఎంఆర్ఓ అశోక్‌కుమార్ స్పందిస్తూ జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపునకు సంబంధించిన అంశాలను నిబంధనల ప్రకారం పరిశీలిస్తామని తెలిపారు. అర్హత, సీనియారిటీ, క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ప్రక్రియను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్హులైన జర్నలిస్టులకు న్యాయం జరిగేలా సంబంధిత అంశాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కట్టెల మల్లేష్, సిహెచ్ రామారావు, మండపాక కళ్యాణ్ చక్రవర్తి, దాడె వెంకట్, ఎం ఎస్ ఆనంద్‌రావు, అంబటి వెంకట్, జంగాల నాగార్జున, బి శంకర్ పాల్గొన్నారు.

## లోటస్ లాప్ పబ్లిక్ స్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సిపిఐ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 14,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం బడంగ్‌పేట్ వీధుల్లో విద్యార్థులు 300 అడుగుల పొడవు గల జాతీయ జెండాను ఎగురవేస్తూ దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్, భగత్ సింగ్, అల్లూరి సీతారామ రాజు, సుభాష్ చంద్రబోస్ సహా దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు విద్యార్థుల ఉత్సాహభరిత ప్రదర్శనలతో స్కూల్ ప్రాంగణం జాతీయ పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ శృతిలయ రెడ్డి,భారత కమ్యూనిస్టు పార్టీ, బాలాపూర్ మండల కార్యదర్శి ముకుందం గారి చంద్రశేఖర్ రెడ్డి,ఏఐటియుసి, బాలాపూర్ మండల అధ్యక్షులు వెల్లంకి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. లోటస్ లాప్ స్కూల్ యాజమాన్యానికి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, అలాగే దేశం కోసం త్యాగం చేసిన అమరులందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

**- కెనరా విద్యా జ్యోతి స్కాలర్‌షిప్ అవగాహన కార్యక్రమం**

**- విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేసిన**

**- కందుకూరు సిఐ హెచ్ వెంకటేశ్వర్లు**

**- తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియ**

**- కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ బి సైదా**



కందుకూరు, ఆగస్టు 14,ప్రజా కలం:

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కందుకూరు సిఐ హెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. కందుకూరు మండలంలోని కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో "కెనరా విద్యా జ్యోతి స్కీమ్" ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు హెచ్. వెంకటేశ్వర్లు కందుకూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియ కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ బి సైదా జడ్పీహెచ్ఎస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్,ఎస్ ఐ పరమేష్ తదితరులు పాల్గొన్నారు. చదువు గురించి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి. తల్లిదండ్రుల కలలను సాకారం చేసి పాఠశాలకు మంచి పేరు తేవాలి. లక్ష్యం నిర్దేశించుకొని పట్టుదలతో కృషి చేయాలని అవగాహన గురించి నేటి సమాజంలోని సైబర్ మోసాలు, ఫ్రాడ్ కాల్స్, ఆన్లైన్ గేమ్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సమస్యలపై అవగాహన ఉండాలి. ఎలాంటి సమస్య వచ్చినా భయపడకుండా ధైర్యంగా, అప్రమత్తంగా ఉండాలి. చట్టపరమైన మార్గాలను అనుసరించాలి. అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలి. ఈకార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, కెనరా బ్యాంక్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విష్ణువర్ధన్ జయంతి.. సేవా స్ఫూర్తి

**-విష్ణువర్ధన్ జయంతి వేడుకలు ఘనం.. 250 మందికి పైగా రక్తదానం..**



**పటాన్‌చెరు, ఆగస్టు 14 (ప్రజా కలం) ప్రతినిధి**

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పెద్ద కుమారుడు కీర్తిశేషులు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి 37వ జయంతిని జీఎంఆర్, జీవీఆర్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆయన జ్ఞాపకార్థం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో జీఎంఆర్ యువసేన,జీవీఆర్ స్నేహితుల సంఘం ఆధ్వర్యంలో భారీ రక్తదాన శిబిరం నిర్వహించగా 250 మందికి పైగా యువకులు రక్తదానం చేశారు. శిబిరాన్ని ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీనివాస్ పర్యవేక్షించారు. రోగులకు పండ్లు, నిరుపేదలకు అన్నదానం చేశారు. బ్లాక్ కార్యాలయ వాణిజ్య సముదాయం ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు,సలహాలు అందించారు. అనంతరం అభిమానులు, సన్నిహితుల సమక్షంలో కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తండ్రికి తగ్గ తనయుడిగా ఎదుగుతున్న సమయంలో విష్ణువర్ధన్ రెడ్డి అకాల మరణం చెందడం బాధాకరమన్నారు. ఆయన సేవా భావం, స్నేహశీలత ఆదర్శనీయమని, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గూడెం మధుసూదన్ రెడ్డి, యాదగిరి యాదవ్,విజయ్ కుమార్, నర్రా బిక్షపతి, రామచంద్రారెడ్డి, పృథ్వీరాజ్, గూడెం సంతోష్ రెడ్డి, గూడెం సందీప్ రెడ్డి, అశోక్, వెంకటేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు..

## భాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేత.

దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 14.

రాయపోల్ గ్రామానికి చెందిన చాకలి యాదయ్య ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు తిమ్మక్‌పల్లి గ్రామానికి చెందిన గంగి యాదగిరి ముందుకు వచ్చారు. తన తండ్రి గంగి రాములు జ్ఞాపకార్థం బాధిత కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం రాయపోల్ మండల కేంద్రంలో బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తిమ్మక్‌పల్లి సర్పంచ్ సత్తు అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. యాదయ్య ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందడం ఎంతో బాధాకరమన్నారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు గంగి యాదగిరి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయ మన్నారు. యాదయ్య మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మధురెడ్డి, యాదగిరి, ఎల్లం, రాయపోల్ వార్డు సభ్యుడు పరశురాములు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం సభకు పటాన్‌చెరు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం

**-సీఎం సభ విజయానికి కాట పిలుపు..**

పటాన్‌చెరు,ఆగస్టు14(ప్రజాకలం న్యూస్)

సంగారెడ్డిలో జరగనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పటాన్‌చెరు కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తమయ్యాయి. ఈ మేరకు పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ తన నివాసంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సీఎం సభకు నియోజకవర్గం నుంచి నాయకులు,కార్యకర్తలు, ప్రజలను భారీగా తరలించేలా చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ఘనంగా విజయవంతం చేయాలని కాట శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. అర్హులైన పేదలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు..



## బిఎస్పీ మల్కాజ్ గిరి పార్లమెంటు ఇంచార్జిగా బాలస్వామి నియామకం...

మేడిపల్లి ఆగస్టు 14 (ప్రజాకలం న్యూస్)

బిఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాహిమ్ శేఖర్ అధ్యక్షతన రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో తెలంగాణ చీఫ్ కో ఆర్డినేటర్ అతహర్ సింగ్ చేతుల మీదుగా దేశంలో అతి పెద్ద పార్లమెంట్ అయిన మల్కాజ్ గిరి పార్లమెంటు ఇంచార్జిగా బాలస్వామిని నియమించి నియామక పత్రం అందజేశారు. నా పైన నమ్మకం ఉంచి నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాహిమ్ శేఖర్ కి, నా సహచర పదాదికారులకు, కార్యకర్తలకు పేరు పేరునా బాలస్వామి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు.









# భారత్ సహనాన్ని బలహీనతగా భావించొద్దు..

## - ఎన్ఎస్ఏ అజిత్ డోభాల్ వార్నింగ్



ఢిల్లీ: భారత్ సహనాన్ని బలహీనతగా భావించొద్దని జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ డోభాల్ హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్‌పై డిస్కవరీలో త్వరలో ప్రసారం కానున్న డాక్యుమెంటరీ సిరీస్‌లో భాగంగా ఎన్ఎస్ఏ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై ఎన్ఎస్ఏ ఇంటర్వ్యూ ఇవ్వడం ఇదే తొలిసారి. పహల్గాం దాడి తరువాత భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో పరిస్థితులపై అజిత్ డోభాల్ ఈ డాక్యుసిరీస్‌లో పలు కీలక వివరాలను వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలు ఏమిటో ముందస్తుగానే నిర్ణయించుకున్నామని అజిత్ డోభాల్ తెలిపారు. పహల్గాం దాడి వెనకున్న ఉగ్రవాద క్యాంపులను ధ్వంసం చేయడమే తమ టార్గెట్ అని పేర్కొన్నారు. ఉగ్రవాద చర్యలపై భారత్ దీటుగా స్పందిస్తుందనే స్పష్టమైన సందేశాన్ని ఆపరేషన్ సిందూర్‌తో పంపామని చెప్పారు. 'ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాము. భారత దేశ సహనాన్ని బలహీనతగా భావించి పొరపాటు చేయొద్దు. భారత్ ఎంతటి రిస్క్‌నైనా తీసుకోగలదు. పర్యావసానాలను లెక్క చేయకుండా దాడులు చేయగలదు' అని ఆయన అన్నారు. డోభాల్‌తో పాటు ఈ ఆపరేషన్ వెనకున్న పలువురు అధికారులు తమ అనుభవాలను ఈ డాక్యుమెంటరీలో వెల్లడించారు. శనివారం రాత్రి 9 గంటలకు డిస్కవరీలో, డిస్కవరీం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఈ డాక్యుమెంటరీ ప్రసారం కానుంది. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన దాడులకు ప్రతీకారంగా భారత్ గతేడాది మే7న ఆపరేషన్ సిందూర్‌ను లాంచ్ చేసిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో పలు ఉగ్రవాద స్థావరాలు ధ్వంసమయ్యాయి. ఆ తరువాత 88 గంటల పాటు ఇరు దేశాలు పరస్పర దాడులు చేసుకున్నాయి. మే 10న పాక్ ప్రతిపాదించిన కాల్పుల విరమణకు భారత్ అంగీకరించింది.










Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by KALAKONDA RAMAKRISHNA, Printed at TEJOMAI PUBLICATION, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com

# విద్యావ్యవస్థ పరువు తీస్తున్న ప్రభుత్వం

## పేద విద్యార్థులని చిన్నచూపా?.. రెండు నెలలు గడిచినా అందని ఉచిత యూనిఫామ్స్

నిర్మల్ ఆగస్టు 14 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని, విద్యార్థులకు అన్ని రకాల ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం గొప్పగా ప్రకటిస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించాల్సిన ఉచిత యూనిఫామ్‌లు పాఠశాలలు ప్రారంభమై దాదాపు రెండు నెలలు పూర్తవుతున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వేసవి సెలవుల సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా రెండు జతల యూనిఫామ్‌లు అందిస్తామని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దుతామని ప్రచారం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నమ్మి అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. కానీ పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా విద్యార్థులకు పూర్తిస్థాయిలో యూనిఫామ్‌లు అందకపోవడం బాధాకరం. కొన్ని ప్రాంతాల్లో చొక్కా కుట్టించేందుకు అవసరమైన వస్త్రం మాత్రమే అందగా, ప్యాంటుకు సంబంధించిన వస్త్రం ఇంకా అందలేదు. దీంతో చొక్కా ఉన్నా ప్యాంటు లేక విద్యార్థులకు పూర్తి యూనిఫామ్ సిద్ధం చేయలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు విద్యార్థులకు బూట్లు అందించినప్పటికీ, సాక్సులు యూనిఫామ్‌లు మాత్రం అందకపోవడం ప్రభుత్వ పథకాల అమలులో ఉన్న లోపాలను స్పష్టంగా తెలియజేస్తోంది. ఫలితంగా విద్యార్థులు పాఠశాల కార్యక్రమాలకు తమ సొంత దుస్తులతోనే హాజరుకావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**స్వాతంత్ర్య దినోత్సవానా ఇదే పరిస్థితి?**

ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులంతా పాఠశాలల్లో జరిగే వేడుకలకు కొత్త యూనిఫామ్‌లతో, ఒకే రూపంలో హాజరవుతారని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆశించారు. కానీ యూనిఫామ్‌లు అందకపోవడంతో విద్యార్థులు తమ సొంత రంగురంగుల దుస్తులతోనే వేడుకలకు హాజరుకావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇది విద్యార్థుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశంగా కూడా మారుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పేద కుటుంబాలకు చెందినవారనే కారణంతో వారిని చిన్నచూపు చూడకూడదని తల్లిదండ్రులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ఉపాధ్యాయులు ఏం సమాధానం చెప్పాలి?

మరోవైపు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులను తీసుకొని ఉపాధ్యాయులు గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించాల్సి ఉంది. ఈ సమయంలో విద్యార్థులు యూనిఫామ్‌లు లేకుండా సొంత దుస్తుల్లో కనిపిస్తే తల్లిదండ్రులు, గ్రామస్తులు సహజంగానే ఉపాధ్యాయులను ప్రశ్నించే అవకాశం ఉంది. "ప్రభుత్వం ఉచితంగా రెండు జతల యూనిఫామ్‌లు ఇస్తామని చెప్పింది కదా? ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదు?" అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ఉపాధ్యాయులు ఏం సమాధానం చెప్పాలి? అనే ఆవేదన వ్యక్తమవుతోంది.ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థుల నమోదు కోసం ఇంటింటికీ తిరిగి, ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరిస్తూ తల్లిదండ్రులను ఒప్పిస్తున్నారు. కానీ ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు సకాలంలో అమలు కాకపోతే పాఠశాలలపై, ఉపాధ్యాయులపై తల్లిదండ్రుల్లో నమ్మకం తగ్గే ప్రమాదం ఉంది.

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇచ్చే ఉచిత యూనిఫామ్‌లు కేవలం దుస్తులు మాత్రమే కావు. అవి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆత్మగౌరవానికి, సమానత్వానికి ప్రతీకలు. అందువల్ల విద్యార్థులందరికీ రెండు జతల నాణ్యమైన యూనిఫామ్‌లను వెంటనే అందించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.ప్రభుత్వం కాగితాలపై పథకాలను ప్రకటించడం కాకుండా వాటి అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. పాఠశాలలు ప్రారంభమైన వెంటనే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, దుస్తులు, బూట్లు తదితర సామగ్రి అందేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలి. "ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా గౌరవంగా, సమానంగా విద్యను అభ్యసించే హక్కు కలిగిన వారే. వారికి ఇచ్చిన హామీలు ఆలస్యం కాకుండా అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత."ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ప్యాంటు వస్త్రంతో పాటు పూర్తి యూనిఫామ్ సామగ్రిని వెంటనే పాఠశాలలకు సరఫరా చేసి, విద్యార్థులకు త్వరితగతిన యూనిఫామ్‌లు అందించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

### కోటి 50 లక్షల రూపాయల నిధులతో

# అభివృద్ధి పనులకు శ్రీకారం

**- ఎడ్ బిడ్ తండా, ఎడ్ బిడ్, కిష్టాపూర్ గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే - గ్రామ గ్రామాన ఘన స్వాగతం పలికిన ప్రజలు**



నిర్మల్ ఆగస్టు14 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

దశల వారిగా గ్రామీణ సమస్యలు పరిష్కరించడమే తన ధ్యేయమని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతానని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అన్నారు. శుక్రవారం ముధోల్ మండలంలోని ఎడ్ బిడ్ తండాలో 32 లక్షల రూపాయలు నిధులతో నిర్మించనున్న జగదాంబ మాత, సేవాలాల్ ఆలయానికి భూమి పూజ, 40 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న గ్రామపంచాయతీ భవనం మహిళా సమైక్య భవనాల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదేవిధంగా ఎడ్ బిడ్ గ్రామం లో 30 లక్షల నిధులతో నిర్మించనున్న గోదాం నిర్మాణానికి భూమి పూజ చేసి, 10 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన మహిళా సమైక్య భవనాన్ని ప్రారంభించారు. లోకేశ్వరం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో 20 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, 20 లక్షలతో నిర్మించిన మహిళా సమైక్య భవనాలను ప్రారంభించారు. ముధోల్ మండలంలో రోడ్ల నిర్మాణానికి పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించడం జరిగిందని, పనులు సైతం పూర్తి కావడం జరిగిందన్నారు, కనకాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరలోనే పూర్తి చేయిస్తామన్నారు. దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని లబ్ధిదారులు ఆందోళన చెందవద్దన్నారు. గత పది సంవత్సరాల కాలంలో ఇండ్ల మంజూరు కాక ప్రజలు ఇబ్బందులు పడ్డ మాట వాస్తవమేనని అందరికీ ఇల్లు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. మూడు సంవత్సరాల కాలంలో పెద్ద మొత్తంలో నిధులు తేవడం జరిగిందని, రాబోయే రెండు సంవత్సరాల్లో అనుకున్న లక్ష్యం చేరుకునే విధంగా అభివృద్ధి చేపడుతామన్నారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామ గ్రామాన ఘన స్వాగతం లభించింది. మహిళా సమైక్య భవనాల నిర్మాణం కావడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు తో పాటు ఆయా మండలాల నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# బంజారా హక్కుల కోసం నంగారా భేరి



## టేకులపల్లి మండల కమిటీ ఎన్నిక

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఆగస్టు 14: (ప్రజా కలం న్యూస్):

రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు ప్రతి తండాకు చేరే వరకు పోరాటం ఆగదని నంగారా భేరి లంబాడి హక్కుల పోరాట సమితి స్పష్టం చేసింది. లంబాడీల హక్కుల సాధనే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సంస్థాగతంగా బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ నరేష్ నాయక్ ఆధ్వర్యంలో టేకులపల్లి మండలంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, న్యాయవాది బానోత్ రమేష్ నాయక్,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు భూక్యా మంగీలాల్ నాయక్ హాజరై నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా టేకులపల్లి మండల అధ్యక్షుడిగా బానోత్ జబ్బర్ లాల్ నాయక్,ఉపాధ్యక్షుడిగా మూడు మురళీ మోహన్ నాయక్ ను నియమించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా బానోత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ "లంబాడీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, పథకాలు ఇప్పటికీ గ్రామస్థాయి వరకు చేరడం లేదు. తండాల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. విద్య, వైద్యం, రోడ్లు, తాగునీటి సమస్యలు నేటికీ వెంటాడుతున్నాయి. ఈ సమస్యలన్నింటిపై నంగారా భేరి లంబాడి హక్కుల పోరాట సమితి ఉద్యమిస్తుంది" అని పేర్కొన్నారు. టేకులపల్లి మండలంలోని అన్ని తండాలను కలుపుకుంటూ సంఘాన్ని బలోపేతం చేయాలని, యువత ముందుకు వచ్చి సమాజ సేవలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని స్పష్టం చేశారు. నూతనంగా నియమితులైన వారు మండలంలోని ప్రతి తండాలో సంఘాన్ని విస్తరించాలని కోరారు.

లంబాడీల ఐక్యతే మన బలం. ఎవరికీ తలవంచకుండా హక్కుల కోసం పోరాడుదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భానోత్ శీను నాయక్ ,గూగులోత్ శ్రీను నాయక్, తేజావత్ శ్యామ్ నాయక్, జాటోత్ చింటూ నాయక్, ఉపేందర్, జాటోత్ మురళి నాయక్, తేజావత్ బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

### జంగిడి శ్రీనివాస్ నియామకంతో

# మండలంలో కాంగ్రెస్ బలోపేతం

**- గ్రామ శాఖ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీరాజు**

**- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియమించడం పట్ల హర్షం**

మల్హర్, ఆగస్టు 14 ప్రజాకలం ప్రతినిధి

ఎడ్లపల్లి గ్రామ సర్పంచ్ జంగిడి శ్రీనివాస్ అలుపెరగని సేవలను, నిరంతర కృషిని గుర్తించి వారిని మల్హర్‌రావు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించడం పట్ల ఎడ్లపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీరాజు హర్షం వ్యక్తం చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు సరైన నాయకుడికి బాధ్యతలు అప్పగించారని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఎడ్లపల్లిలో డాక్టర్ లక్ష్మీరాజు ఆధ్వర్యంలో నూతన మండల అధ్యక్షుడు జంగిడి శ్రీనివాస్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీరాజు మాట్లాడుతూ.. జంగిడి శ్రీనివాస్ నియామకంతో మల్హర్‌రావు



మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని నమ్మకం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఆయన ఇలాంటి మరెన్నో ఉన్నతమైన స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎడ్లపల్లి గ్రామ ఉప సర్పంచ్ వేల్పుల రమేష్, గ్రామ వార్డు సభ్యులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, మాజీ సర్పంచులు, మాజీ ఉప సర్పంచులు మరియు సీనియర్ కార్యకర్తలు పాల్గొని నూతన అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యుత్ షాక్‌తో తండ్రీకొడుకులు దుర్మరణం

**గంగారం గ్రామంలో అలుముకున్న తీవ్ర విషాదం - కేసు నమోదు చేసిన కొయ్యూరు పోలీసులు**

మల్హర్, ఆగస్టు 14 ప్రజాకలం ప్రతినిధి

వ్యవసాయ మోటార్ వంక పైపు తిప్పే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై తండ్రీకొడుకులు అక్కడికక్కడే దుర్మరణం చెందిన అత్యంత హృదయ విదారక ఘటన మల్హర్ మండలం కొండంపేట గ్రామ శివారులో చోటుచేసుకుంది. కరెంట్ షాక్ తీవ్రతకు మృతదేహాల ముఖంపై రక్తం చిమ్మి, అక్కడికక్కడే విగతజీవులుగా పడిపోయిన తీరు స్థానికులను తీవ్రంగా కలచివేసింది. కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన కట్టెకోల రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొయ్యూరు ఎస్ఐ మహేందర్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగారం గ్రామానికి చెందిన యాదవ కులస్థుడైన కట్టెకోల బాపు (40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అతని కుమారుడు కట్టెకోల మనోజ్ ( 23) వృత్తి స్టూడెంట్) ఇరువురు కలిసి గురువారం ఉదయం 8 గంటల సమయంలో కొండంపేట శివారులోని తమ వ్యవసాయ భూమి వద్దకు పనుల నిమిత్తం వెళ్లారు. వ్యవసాయ పనుల అనంతరం సాయంత్రం సమయంలో ఇంటికి వచ్చే ముందు, వ్యవసాయ బోరు విద్యుత్ మోటారుకు బిగించిన వంక పైపును తిప్పేందుకు ప్రయత్నించారు.







ఈ క్రమంలో దురదృష్టవశాత్తు ఇరువురిపై విద్యుత్ ప్రసారమై ఒక్కసారిగా కరెంట్ షాక్ రావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం, రాత్రి పనులు ముగించుకొని చుట్టాల ఇంటి వద్ద పడుకొని ఉంటారని కుటుంబ సభ్యులు భావించడంతో ఈ విషయాన్ని రాత్రి గమనించలేకపోయారు. మరుసటి రోజు శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా తండ్రీకొడుకులు ఇద్దరూ మరణించి ఉండటాన్ని గుర్తించారు. ఒకే కుటుంబంలో తండ్రి, కొడుకు ఇద్దరూ విద్యుత్ ఘాతానికి బలికావడంతో గంగారం గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై కొయ్యూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గాంధీభవన్‌లో గంప వేణుగోపాల్‌కు ఘన సన్మానం

**పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మరింత కృషి చేయాలి: కాంగ్రెస్ నాయకులు**

మెట్ పల్లి రూరల్, ఆగస్టు 14;(ప్రజా కలం):కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను గుండెల్లో నింపుకుని, కష్టకాలంలోనూ పార్టీ జెండాను భుజాన మోస్తూ అంకితభావంతో పనిచేస్తున్న గంప వేణుగోపాల్‌ను టీపీసీసీ(ఎస్ ఎస్ ఏ)సంఘటన్ సృజన్ అభియాన్ చైర్మన్‌గా నియమించిన సందర్భంగా శుక్రవారం గాంధీభవన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మండలం వేంపేట్ గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కో–ఆర్డినేటర్ గోరుమంతుల ప్రవీణ్ కుమార్ గంప వేణుగోపాల్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గంప వేణుగోపాల్ చేస్తున్న సేవలను నాయకులు అభినందించారు. పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, గ్రామస్థాయి నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన కృషి చేయాలని సూచించారు.పార్టీ కార్యకర్తలను సమన్వయం చేస్తూ, యువతను కాంగ్రెస్ వైపు ఆకర్షించడంలో గంప వేణుగోపాల్ కీలక పాత్ర పోషించాలని నాయకులు పేర్కొన్నారు. కొత్త బాధ్యతతో పార్టీకి



మరింత సేవ చేసే అవకాశం లభించిందని, కార్యకర్తలందరినీ కలుపుకుని ముందుకు సాగుతానని గంప వేణుగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు మ్యాదరి శివాగ్ని, మగ్గిడి నందు, అచ్చంపేట నియోజకవర్గ యువ నాయకుడు వంగనూర్ శివకుమార్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ కాంగ్రెస్ యువ నాయకుడు మల్లె సునీల్, ఎన్ఆర్ఐ యువ నాయకుడు సూర్య రోహన్ దత్త తదితరులు పాల్గొని గంప వేణుగోపాల్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి





**- అదనపు కలెక్టర్ రాజాగౌడ్**

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 14 (ప్రజాకలం) సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ వెల్లడించారు. శుక్రవారం కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ మున్సిపాలిటీలోని అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రజలకు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వర్షపు నీటి నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే మున్సిపాలిటీలోని అన్ని విభాగాలకు సంబంధించిన విధుల్లో ఎలాంటి జాప్యం లేకుండా, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగంగా అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వి. రాఘవేంద్ర, మేనేజర్, టీపీఓ, ఏఈ, జేఏఓ, ఆర్ఓ, ఎస్ఐ, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వేగంగా వచ్చిన బొలేరో ట్రాలీ ఢీకొని గేదె దుర్మరణం

– రైతుకు పరిహారం కోరుతున్న గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 14;(ప్రజా కలం): మండల పరిధిలోని వేంపేట శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక గేదె అక్కడికక్కడే మృతి చెందింది.



స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ముత్యంపేట గ్రామానికి చెందిన రైతు నిమ్మల రాజారెడ్డికి చెందిన గేదె రోడ్డు దాటుతుండగా, నర్సరీ మొక్కలతో వేగంగా వచ్చిన బొలేరో ట్రాలీ (నంబర్: టీ ఎస్ 21 టి 9195) బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు గేదె తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది.ప్రమాద సమయంలో వాహనం అధిక వేగంతో ఉండటం, జాగ్రత్తలు తీసుకోకపోవడం ప్రమాదానికి కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో స్థానిక రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రమాదానికి కారణమైన వాహన చోదకుడిపై తగిన చర్యలు తీసుకోవాలని, బాధితుడైన రైతు నిమ్మల రాజారెడ్డికి తగిన పరిహారం చెల్లించాలని గ్రామస్తులు, స్థానిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# వేడుకలకు సిద్ధమైన పరేడ్ గ్రౌండ్



జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 14 (ప్రజాకలం) జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేడుకలకు హాజరయ్యే అధికారులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ పతాకాన్ని రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ ఆవిష్కరించనున్నారు. జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వేడుకలకు అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. పోలీసు పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లను కూడా సిద్ధం చేశారు.

# ఉద్యోగుల సమస్యలపై పిఆర్టియు పోరుబాట

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:ఆగస్టు 14;(ప్రజా కలం న్యూస్):



ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పిఆర్టియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భారీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు కె. ప్రసాద్ ప్రకటించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు విద్యానగర్ కాలనీ బైపాస్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు 2K రన్ పాదయాత్ర చేపడతామని తెలిపారు. ఈ ర్యాలీని ఉద్యోగులు, ఉపాధ్యాయులు అందరూ జయప్రదం చేయాలని కోరారు.ముఖ్యంగా పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, ఎన్ పి ఎస్ ను వెంటనే రద్దు చేయాలని పెండింగ్‌లో ఉన్న బిల్లులు,రిటైర్మెంట్ బకాయిలు విడుదల చేయాలి.ఆశ్రమ,సింగరేణి, కస్తూర్బా పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. రూ.398 వేతనంతో పనిచేసిన కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు."ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే మా లక్ష్యం. ఈ పాదయాత్ర ద్వారా మా గోసను అధికారులకు విన్నవిస్తాం" అని కె. ప్రసాద్ పేర్కొన్నారు.

# సీనియర్ కాంగ్రెస్ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించిన జాటోత్ శ్రీనివాస్ నాయక్

(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 14, ప్రజాకలం ప్రతినిధి.పర్వతగిరి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రెడ్యా నాయక్ తండ్రి సోమ్లా నాయక్ గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న కంటెస్టెడ్ జెడ్పీటీసీ జాటోత్ శ్రీనివాస్ నాయక్ సోమ్లా నాయక్ కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా జాటోత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాంప నాయక్, గ్రామ శాఖ అధ్యక్షుడు మోహన్ నాయక్, మాజీ సర్పంచ్ జనగాం సంబంధం, కాంగ్రెస్ పార్టీ మాజీ వార్డు సభ్యులు గుగులోతు భాస్కర్, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకాన్ని

# ఆవిష్కరించనున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



మహబూన్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 14 :

మహబూబ్‌నగర్ జిల్లాలో 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించను న్నారు. జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో ఉదయం 9.30 గంటలకు రాష్ట్ర ఎక్సైజ్ , పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. జాతీయ పతాకావిష్కరణ, గౌరవ వందనం అనంతరం 9.32 నుంచి 9.45 గంటల వరకు పోలీస్ కవాతు నిర్వహిస్తారు.ఉదయం 9.45 నుంచి 10.15 గంటల వరకు మంత్రి స్వాతంత్ర్య దినోత్సవ సందేశం ఇవ్వనున్నారు. 10.15 నుంచి 10.20 గంటల వరకు స్వాతంత్ర్య సమరయోధుల పరిచయం, సన్మానం, 10.20 నుంచి 10.50 గంటల వరకు విద్యార్థుల చే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 10.50 నుంచి 11.20 గంటల వరకు వివిధ ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల శకటాల ప్రదర్శన, 11.20 నుంచి 11.40 గంటల వరకు ప్రశంసా పత్రాల పంపిణీ జరుగుతుంది. అనంతరం 11.40 నుంచి 11.50 గంటల వరకు స్టాళ్లను సందర్శిస్తారు. 11.50 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హై టీతో కార్యక్రమం ముగియనుంది.జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు.

# కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా గ్రామకమిటీల పునర్నిర్మాణం

కాంగ్రెస్ పార్టీ అయినవోలు మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్

కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయం

అయినవోలు, ఆగస్టు 14:– ( ప్రజా కలం ప్రతినిధి )

ప్రజాసేవే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేద ప్రజలకు చేరవేస్తూ, కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా అయినవోలు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీల పునర్నిర్మాణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షులు ఇనుగాల వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం అయినవోలు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద అయినవోలు గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్ష పదవికి పేర్ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పేర్లు నమోదు చేసుకున్నారు.

**కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం: నకరకంటి మోహన్ గౌడ్**

ఈ సందర్భంగా మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కమిటీల పునర్నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావడంతో పాటు దేశంలో రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలనే లక్ష్యంతో ప్రతి



కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సహకారంతో నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

**భారీగా హాజరైన కాంగ్రెస్ శ్రేణులు**

కార్యక్రమంలో జిల్లా కమిటీ ఇన్‌చార్జిలు తెల్లా సుగుణ–కిషోర్, అనుకోటి నాగరాజు, అరకపుల రాజు, హనుమకొండ జిల్లా డిజిటల్ మీడియా ఇన్‌చార్జి రాయపురం సాంబయ్య, మండల ఫోరం అధ్యక్షులు పోలపల్లి శివశంకర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి, టెంపుల్ డైరెక్టర్ పూస చిరంజీవిరెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు గ్యాదరి భాస్కర్, మండల నాయకులు బొమ్మినేని రాకేష్ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు రావుల రవీందర్, కాంటెస్ట్ సర్పంచ్ బొల్లపల్లి మధు, ఉపసర్పంచ్ బరిగల భాస్కర్, మండల యూత్ అధ్యక్షులు కత్తి సుధీర్ గౌడ్, యూత్ ఉపాధ్యక్షులు కొండేటి దిలీప్ తదితరులు పాల్గొన్నారు. అయినవోలు గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ గ్రామ కమిటీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# సోమ్లా నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ ఉప అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు



(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 14, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రెడ్యా నాయక్ తండ్రి సోమ్లా నాయక్ గురువారం రాత్రి మృతి చెందగ శుక్రవారం వారి కుటుంబాన్ని పరామర్శించి బౌతిక ధేహానికి నివాళు లర్పించి, బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా అండగ ఉంటామని బరోసా ఇచ్చిసంఘీభావం తెలిపినా మాజీ జిల్లా కాంగ్రెస్ఉప అధ్యక్షులు పిన్నింటి అనిల్ రావు మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జాంప నాయక్, గ్రామ శాఖ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు,మాజీ వార్డు సభ్యులు గుగులోతు భాస్కర్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వం అందించే పెన్షన్లు నిజమైన అర్హులకే దక్కాలి

- **సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులదే పూర్తి బాధ్యత**
- **గ్రామ పంచాయతీల్లోనే దరఖాస్తుల స్వీకరణ**
- **దళారులను ఆశ్రయించి మోసపోవద్దు**
- **ఈ నెల 31 నాటికి జాబితా రూపకల్పన పూర్తి కావాలి**
- **పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ ఆదేశం**

(వరంగల్/పర్వతగిరి) ఆగస్టు 14, ప్రజాకలం ప్రతినిధి

తెలంగాణ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా, నిజమైన అర్హులకు మాత్రమే లబ్ధి చేకూరేలా చూడాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ స్పష్టం చేశారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పరస్పర సమన్వయంతో వ్యవహరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఆమె హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని జిల్లా పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందేలా చూసే పూర్తి బాధ్యత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులదేనని స్పష్టం చేశారు. ప్రజలు దరఖాస్తుల కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన అవసరం లేదని, దరఖాస్తులను నేరుగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే అందజేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని ఆదేశించారు. పెన్షన్ల మంజూరు పేరుతో అమాయక ప్రజలను మోసం చేసే దళారులకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వవద్దని




దివ్య దేవరాజన్ అధికారులను హెచ్చరించారు. దళారులను ఆశ్రయించి ప్రజలు నష్టపోవద్దని, నేరుగా పంచాయతీ అధికారులను సంప్రదించాలని కోరారు. ఒకవేళ ఎక్కడైనా దళారు ప్రమేయం ఉన్నట్లు తేలితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

ఈ నెల 31 నాటికి పూర్తి జాబితా సిద్ధం కావాలి.

వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, డయాలసిస్ రోగులు, కల్లుగీత కార్మికులు, ఫైలేరియా బాధితులు, దివ్యాంగుల విభాగాల్లోని ప్రతి అర్హుడినీ గుర్తించి, ఈ నెల 31వ తేదీ నాటికి లబ్ధిదారుల తుది జాబితాలో చేర్చాలని ఆదేశించారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ సాంకేతిక లేదా ఇతర కారణాలతో నష్టపోకూడదని, క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిజమైన లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేయాలని ఉద్ఘాటించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లొ ఎంపీడీవో శంకర్ నాయక్, ఎంపీఓ శేషు, మండలం లోని వివిధ గ్రామాల సర్పంచ్ లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# షాపింగ్ మాల్ వద్ద పోయిన పుస్తెల పర్సు

సీసీ ఫుటేజీ ఆధారంగా పుస్తెల పర్సును ఇప్పించిన పోలీసులు




ధర్మారం, ఆగస్టు 14 : ( ప్రజా కలం ప్రతినిధి ) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రం లో తేదీ 13.08.2026 గురువారం రోజున సాయంత్రం పూట ఒక షాపింగ్ మాల్ వద్ద కొండాపూర్ గ్రామానికి చెందిన ఎనగందుల స్రవంతి అను ఆమె బట్టలు తీసుకుని వెళ్తుండగా ఆమె యొక్క పర్సు బంగారపు ముప్పావు తులం పుస్తెలు, గుండ్లు పోగొట్టు కోగా వెంటనే పోలీస్ వారికి షాపింగ్ మాల్ వారు సమాచారం ఇవ్వగా ఎస్ ఐ ఆదేశాల మేరకు పోలీస్ పిసి సతీష్ సీసీ కెమెరా ఫుటేజీ లను పరిశీలించి అట్టి బంగారు పర్సు తీసుకున్న వ్యక్తిని గుర్తించి కొండాపూర్ గ్రామానికి చెందిన ఎనగందుల స్రవంతిని అతనిని పిలించి ఆమె కి అట్టి బంగారు పుస్తెల పర్సును ఇప్పించడం జరిగిందిని ధర్మారం ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# గుట్టలు కొల్లగొడితే కఠిన చర్యలు

-మట్టి తవ్వకాలకు అనుమతులు తప్పనిసరి

-జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

గద్వాల ప్రతినిధి ఆగస్టు 14 ప్రజా కలం:

జోగులాంబ గద్వాల జిల్లాలో అనుమతులు లేకుండా గుట్టలు, ఇతర ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.



జనావాస ప్రాంతాలకు కనీసం 200 మీటర్ల దూరంలోనే మట్టి తవ్వకాలు చేపట్టాలని స్పష్టం చేశారు.శుక్రవారం ఐడీఓసీలోని తన ఛాంబర్ నుంచి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మట్టి తవ్వకాలపై ప్రీ-ఆక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని గుట్టలను గుర్తించి బ్లాకులుగా విభజించి, మైనింగ్, జియోలాజికల్ శాఖల సమన్వయంతో నిబంధనల ప్రకారం వేలం నిర్వహించి లీజులు ఖరారు చేయాలని సూచించారు.అక్రమ తవ్వకాలను అరికట్టడంతో పాటు అధికారిక అనుమతుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, మైనింగ్ ఏడీ ఆనంద్, సర్వే ఏడీ నూకరాజు, భూగర్భ జల శాఖ డీడీ మోహన్, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పంద్రాగస్టుకు సర్వం సిద్ధం

**పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ**



గద్వాల ప్రతినిధి ఆగస్టు 14 ప్రజా కలం:జోగులాంబ గద్వాల,జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 9:30 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్ మధు మోహన్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్ రావు, ట్రైన్ డ్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, ఏవో మంజుల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఐనవోలు గ్రామంలో కోతుల పట్టివేత

- సర్పంచ్ రఘు వంశి గౌడ్ ఆధ్వర్యంలో పాలకవర్గంకృషి
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐనవోలు గ్రామ అభివృద్ధి
- అయినవోలు గ్రామ సర్పంచ్ గడ్డం రఘు వంశీ గౌడ్

ఆగస్టు 14 అయినవోలు:-( ప్రజా కలం ప్రతినిధి )ఐనవోలు గ్రామంలో ప్రధాన సమస్య ఐన కోతుల బెడదను నివారించేందుకు గ్రామ పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టారు. గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని కోతులను పట్టించే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గడ్డం రఘువంశీ గౌడ్, ఉపసర్పంచ్ బరిగల భాస్కర్ మరియు పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.ఐనవోలు గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. కోతులు ఇళ్లలోకి చొరబడుతూ ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడంతో పాటు, పంటలు మరియు వస్తువులను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో కోతుల వల్ల ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులు మరియు వృద్ధులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి గ్రామ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తోంది..

